# ప్రజాదర్బార్

తెలుగు దినపత్రిక

## జిల్లా అనుబంధం

బుధవారం,అక్టోబర్,28,2026 | పేజీలు : 8


### అత్యాధునిక ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్) : ప్రభుత్వాలకు, పౌరులకు సాంకేతిక సేవలు అందిస్తున్న బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ నిర్వహణలో కొత్తగూడెంలో అత్యాధునిక ఆధార్ సేవా కేంద్రం(ఎ.ఎస్.కె)ను జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ అంకిత్ ఐఎఎస్ ఇతర ప్రముఖులతో కలిసి ప్రారంభించినట్లు బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు రోజుకు 200 నుంచి 250 మందికి సేవలు అందించే సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో వీల్‌చైర్, దివ్యాంగులకు అనుకూలమైన మరుగుదొడ్లు, నిరీక్షణ ప్రాంతం, టోకెన్ వ్యవస్థ, తాగునీరు, ఏసీ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం, సందేహాల నివృత్తికి కూడా ప్రత్యేక సహాయం అందించనున్నట్లు తెలిపారు.

# స్పోకెన్ ఇంగ్లీష్‌తోనే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది:జిల్లా కలెక్టర్ రాజర్షి షా..

## విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించాలని సూచన..

ఆదిలాబాద్ ప్రజాదర్బార్ ప్రతినిధి అక్టోబర్ 27:విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ నెలకు సంబంధించిన'స్పోకెన్ ఇంగ్లీష్ రివ్యూ మీటింగ్ కమ్ కాంపిటీషన్స్'ను మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు.దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు.నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషా సంభాషణ నైపుణ్యాలు ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.విద్యార్థులు చిన్ననాటి నుంచే ఇంగ్లీష్‌లో ధైర్యంగా,స్పష్టంగా మాట్లాడేలా ప్రోత్సహించాలని, పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ బోధనను సమర్థవంతంగా అమలు చేస్తూ,విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఉన్న భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఆంగ్ల భాషా సామర్థ్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతిపై సమీక్ష నిర్వహించారు.అనంతరం వివిధ అంశాల్లో స్పోకెన్ ఇంగ్లీష్ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించి..విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.ఇందులో ఆరోగ్య పాఠశాల జిల్లా కోఆర్డినేటర్ అజయ్,స్కూల్ అసిస్టెంట్లు రఘునాథ్, బాలాజీ,ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రప్రభుత్వరాజ్యాంగబద్ధమైనటువంటి ఓటు హక్కు ప్రజలకు దక్కకుండా సర్ .సర్వే తొలగించడం పైన ఢిల్లీలో ధర్నా, జూన్ 1న ఢిల్లీలో. ధర్నా

## విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాయకులకు కార్యకర్తలకు పిలుపు.

ఆమనగల్ ఆగస్టు 26. ప్రజా దర్బార్.రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల ఓటు హక్కు. ఒకటిగా రాజ్యాంగ నిపుణులు అంబేద్కర్ రాసినటువంటి రాజ్యాంగ పౌలాల్లో ఓటు హక్కు జీవించే హక్కు పనిచేసే హక్కు. విద్య హక్కు కానీ ఒక పరిపాలిస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీ కులతత్వం మతతత్వం పేరుతో భారతదేశాన్ని ఉద్యమం చేసే రాజ్యాంగంలో ఉన్న హక్కులను ఒకటి ఒకటిగా తొలగించి మతతత్వ పార్టీగా భారత దేశాన్ని ఏర్పాటు చేయాలని కుతంత్రంతో సార్. నివేదిక ఓట్ల సర్వే ఎక్కడ లేని నియమ నిబంధనలు రూపొందించి ఓట్లను తొలగించడం జరిగిందని అటువంటి దుశ్చర్యకు సహకరిస్తున్నటువంటి కేంద్ర ఎన్నికల అధికారిజ్ఞానేశ్వర్ కుమార్ ను. వెంటనే పదవి నుంచి బర్తే అప్ చేయాలని భారత కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయం లో రామ్ లీలా మైదానంలో ధర్నా. కార్యక్రమం నిర్వహించబడినదని అటువంటి కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్నాయకులుముఖ్యమైనటు వంటి కార్యకర్తలు హాజరై ధర్నా కార్యక్రమం నిర్వహించడం చేయాలని శాసనసభ్యులు. కసిరెడ్డి రెడ్డి నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు కావున జిల్లా నాయకులు ఖచ్చితంగా జూన్ 1న రామ్ లీలా మైదానంలో ధర్నా .కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులకు ప్రజాప్రతినిధులకు కార్యకర్తలకు అభిమానులకు ఆయన ఒకటి ప్రకటనలో తెలియజేశారు. మోడీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రజలకు అన్యాయం చేశారని దేశంలో ఉన్నటువంటి ప్రధాన హక్కులు ఓటు హక్కు. జీవించే హక్కు. విద్య హక్కు .వైద్య హక్కు. అన్ని హక్కులు రాజ్యాంగమే మార్చాలని కుతంత్రంతో భారతీయ జనతా పార్టీ మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి సంక్షేమ పథకాలు ప్రజలకు నిర్వీ చేయడం జరిగినదని అటువంటి మతలతో పార్టీని వచ్చే ఎన్నికల్లో గద్దె దింపే ప్రయత్నం అందరూ ఐకమత్యంగాగా .నోటాకు ద్వారా వారిని పదవ నుంచి వైదొ ధరించాలనీ కుతంతో ఆయన పిలుపునిచ్చారు దేశంలో కార్మికులు కర్షకులు. శ్రామికులు .ఎంతోమంది రోజువారి కూలీలు వారి జీవనోపాధి కార్మికులలో కూలీలుగా ఉన్నటువంటి బిఎస్ఎన్ఎల్. కంపెనీలు జీవిత బీమా ఏర్పాటు చేసి ప్రజలు నెలవారిగాను పొదుపు చేసుకుని జీవితాలను మెరుగుపరిచే మాత్రమే దార దత్త చేసినటువంటి ఘనత భారతీయ జనతా పార్టీ మోడీది .అనే ఆయన దుయ్యబట్టారు అదేవిధంగా కోట్లాది రూపాయలు అప్పులు తీసుకొని రతన్ టాటా. ఇన్సూరెన్స్ కంపెనీలు బడా భూస్వాములు పెత్తందారులకు కోట్లాది రూపాయలు బ్యాంకు ద్వారా అప్పులు ఇచ్చినటువంటి బడా దొంగలకు రక్షణ పలికిన రక్షించిన మోడీ విజయ మాల్యా. భారత దేశ బ్యాంకుల నుండి అప్పు తీసుకొని




వేగనామం పెట్టినటువంటి బడా .బూజువ మతతంత పార్టీలకు మద్దతు పలికినటువంటి భారతీయ జనతా పార్టీకి వారికి వారిని రక్షించడానికి సన్యాసులను దేశంలో పార్లమెంటు నిర్మాణము ప్రారంభ కార్యక్రమంలో ఎవర్ని రాజ్యాంగంలో ఉన్నటువంటి రాజకీయ నాయకులను మంత్రులను ప్రజాప్రతితులను మేధావులను రాష్ట్రపతినే గవర్నర్ను పిలువకుండా ఒక సన్యాసులతో ప్రారంభించడం ఎంతో వరకు సమంజసం అనే ఆయన మోడీప్రభుత్వంపైఆరోపించా రుకార్యక్రమాలపై ఎమ్మెల్యే శాసనసభలో నారాయణరెడ్డి ఆరోపించారు. గారు కావున జూన్ 1న .జరిగే ప్రధాన హక్కు ఓటరు ను తొలగించినందున వెంటనే కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే బర్తే చేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మేధావులను విద్యావంతులను ఎమ్మెల్యే శాసనసభ్యులు కాశిరెడ్డి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలు నాయకులను కోరుతూ ఉన్నారు

# నిధుల గోల్మాల్ గ్రామ సభలో రచ్చ రచ్చ

కామారెడ్డి 27 అక్టోబర్ ( సజాదర్బార్ ప్రతినిధి )కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట గ్రామంలో సోమవారం జరిగిన గ్రామసభ రణరం గంగా మారింది. గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ నాగులపల్లి రాజేందర్ అధ్య క్షతన నిర్వహించిన ఈ సమావేశం, అభివృద్ధి చర్చ లకంటే మించి నిధుల గోల్‌మాల్ దుమారంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాధనం ఎటుపోతోంది? మా పంచాయతీ సొమ్ముకు లెక్కలేదా? అంటూ గ్రామస్తులు, యువకులు సర్పంచ్, అధికా రులపై ప్రశ్నల వర్షం కురిపించారు. సభ సాక్షిగా ప్రజలు నిలదీయడంతో సర్పంచ్ వర్గంలో ఉత్కంఠ నెల కొంది. గ్రామసభలో మాస్ పంచులు – సర్పంచ్‌పై గ్రామస్తుల తిరుగుబాటు:ఆర్టీఐ అస్త్రం – రికార్డుల డొల్లతనం: గతంలో గ్రామ పంచాయతీకి మంజూ రైన నిధులు,వాటి ఖర్చుల వివరాలపై ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేసుకున్నా అధికారులు పెడచెవ పెట్టారని, ముఖ్యంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ సమాచా రాన్ని మరుగున పరిచారంటూ బీజేపీ సీనియర్ నాయకులు గో? గంగారం సభలో నిలదీశారు. “మా గ్రామ నిధుల లెక్కలు చెప్పే దమ్ము మీకు లేదా?” అంటూ నిప్పులు చెరిగారు.ఒకే రోజు డ్రామాలు – డిజిటల్ సైన్ల లీలలు: బ్యాంకులో డిజిటల్ సైన్‌లు ఒకే కాలేదని ఉప సర్పంచ్ ప్రవీణ్ గౌడ్ చెబుతుండగానే, ఫిబ్రవరి 3వ తేదీన




రూ. 5,940, అలాగే మే 12న రూ. 12,380 చొప్పున డిజిటల్ పద్ధతిలో నగదు ఎలా డ్రా చేసుకున్నారని గ్రామస్తులు సూటిగా ప్రశ్నించారు. “ఒకే రోజు ఈ స్థాయిలో మాయాజాలాన్ని ఎలా నడిపించారు? మా కళ్ళల్లో మట్టి కొట్టాలని చూస్తే ఊరుకోం” అంటూ సభలోనే రగిలిపోయారు.ట్రాక్టర్ మర మ్మతుల పేరుతో దోపిడీనా?: గ్రామానికి చెందిన ట్రాక్టర్ మరమ్మతుల కోసం ఏకంగా రూ. 76,000 చెల్లించినట్లు రికార్డుల్లో చూపించారని, అసలు ట్రాక్టర్‌కు ఆ స్థాయిలో పనులు జరిగాయా? లేక కాగితాలపైనే బిల్లులు రాసుకొని నిధులు పంచుకు న్నారా? అంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ నిధుల గోల్‌మాల్ వెనుక పెద్దల హస్తం ఉందని గ్రామస్తులు మండిపడ్డారు.సర్పంచ్ సన్నాయి నొక్కులు – అధికారుల మౌనం.గ్రామస్తులు అడిగిన సూటి ప్రశ్నలకు సర్పంచ్ నాగులపల్లి రాజేందర్ నీళ్లు నములుతూ.. బ్యాంకు లావాదేవీలకు సం బంధించిన పూర్తి వివరాలను త్వరలోనే అందజే స్తామని కాలయాపన సమాధానం చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, పంచా యతీ కార్యదర్శి సంజీవ్, పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజాధ నాన్ని దోచుకుంటే ఊరుకునేది లేదని, సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలని గ్రామ స్తులు హెచ్చరిస్తున్నారు. రెడ్డిపేట గ్రామసభలో జరిగిన ఈ రచ్చ ప్రస్తుతం రామారెడ్డి మండలంలో హాట్ టాపిక్‌గా మారింది.

# అర్హులందరికీ పట్టభద్రుల ఓటు హక్కు కల్పించాలి
# గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి

## -యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి

చేవెళ్ల,అక్టోబర్ (ప్రజాదర్బార్ ): ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి సూచించారు.పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల యూత్ కాంగ్రెస్ నాయకుల కార్యనిర్వాహక సమావేశం చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్గారి కార్తీక్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు బొల్లారం ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లోని పట్టభద్రులను గుర్తించి, అర్హులైన వారందరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునేలా నాయకులు చొరవ చూపాలని అన్నారు. నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలను అర్హులకు తెలియజేసి, దరఖాస్తు చేసుకునేందుకు సహకరించాలని సూచించారు. గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రుల్లో అవగాహన పెంచాలని కోరారు.ఈ సమావేశంలో చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దయానందగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మాజీ డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, తాళ్లపల్లి నర్సింలు, మాజీ సర్పంచ్



మధుసూదన్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, రాఘవేందర్, అత్తెలి రవీందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ మైనార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు మహమ్మద్ చాన్‌పాషా, మైనార్టీ నేత రఫిక్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మహేందర్‌గౌడ్, శంకర్‌పల్లి యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శశి, సోషల్ మీడియా అసెంబ్లీ కోఆర్డినేటర్ మహేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మండల సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శులు జాఫర్, లక్ష్మణ్, గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హుల ఓట్లు గల్లంతు కావొద్దు!

చండూరు, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సవరణలు చేపట్టాలని జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకురాలు దేవసేన అధికారులకు సూచించారు. మంగళవారం చండూరు ఆర్డీవో కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హుల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను నవంబర్ 5 లోగా పరిష్కరించి, నవంబర్ 9న తుది జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై ఎన్నికల పరిశీలకురాలు అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో శ్రీదేవి, ఎమ్మార్వో రమాకాంత్ శర్మ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# దివీస్ వారి సేవలు అభినందనీయం

యాదాద్రి(అక్టోబర్ 27)వలిగొండ ప్రజాదర్బార్ న్యూస్: గ్రామాలలోని విద్యార్థుల పట్ల దివీస్ ల్యాబొరేటరీ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ నూతి ఇందిరా రమేష్ అన్నారు.మంగళవారం మండలంలోని గోకారం,జాలూకాల్వ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరం సుమారుగా ఒక లక్ష రూపాయల నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల అభివృద్ధికి దివీస్ వారు ఎంతో కృషి చేస్తున్నా రని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నూతి రమేష్ జాలూకాల్వ సర్పంచ్ మద్దెల మంజుల సందీప్, దానయ్య, నగేష్, కృష్ణవేణి, సురేష్,గోపి,వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రామన్నగూడలో రూ.43 లక్షలతో సీసీ రోడ్డు పనులు

చేవెళ్ల,అక్టోబర్ 27 (ప్రజాదర్బార్): పట్టణాలు,గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్దే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని రామన్నగూడ 10వ వార్డులో రూ. 43 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలే యాదయ్య మంగళవారం స్థానిక కౌన్సిలర్ పెద్దోళ్ళ దయాకర్, చైర్పర్సన్ దేవరసమత వెంకట్ రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్, కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి పలువురి కౌన్సిలర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతోపాటు, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వహర్‌నగర్ డంపింగ్ యార్డు తరలింపునకు ఈటల పాదయాత్ర

మల్కాజిగిరి, అక్టోబర్ 27 (ప్రజాదర్బార్): జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రజల పక్షాన చేపట్టిన పాదయాత్రలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్చందర్ రావుతో, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల మాణిక్య రెడ్డి పాల్గొన్నారు. ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువు వద్ద నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఈ పాదయాత్ర ప్రారంభించారని తెలిపారు. అనంతరం మద్రివల్లిగూడెం, చందుపట్లగూడ, ఎన్ఎఫ్‌సీ నగర్, బొక్కనిగూడెం, ఘన్‌పూర్ మీదుగా అన్నోజిగూడకు చేరుకొని.. పాదయాత్రలో భాగంగా బాధితులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకోనున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా బిజెపి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలి.

**- కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగంలో అగ్రస్థానంలో ఉండే. - తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. - కాంగ్రెస్ విధానాలతోనే నల్గొండలో కరువు: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి.**

హాలియా (ప్రతినిధి) అక్టోబర్ 27 (ప్రజాదర్బార్):- రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అధ్యక్షతన హాలియాలో ఎమ్మెల్సీ ఓటర్ల సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టభద్రులందరూ ఓటరుగా నమోదయ్యేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో చైతన్యం చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూచించారు. త్వరలో జరగనున్న నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్రాన్ని తిరిగి పాత రోజుల్లోకి తీసుకెళ్లిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులతో పాటు ఎడమ కాలువ కింద నీటి సరఫరా పరిస్థితికి జిల్లా మంత్రుల వైఫల్యం, ప్రభుత్వ లోపాలే విధానాలే కారణమని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగంలో అగ్రస్థానంలో నిలిచిన ఉమ్మడి నల్గొండ జిల్లా, కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని విమర్శించారు. వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత కరువు పరిస్థితులు కేవలం కాల ప్రభావం వల్లనో, ఎల్‌నినో వల్లనో ఏర్పడలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలోనూ ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, ధరల అంశంపై ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ సహా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదును వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి రాబోయే





ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి,ఏనుగుల రాకేష్ రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ నాగార్జునసాగర్ బూడిద భిక్షమయ్యగౌడ్, రామచంద్రనాయక్, రిక్కల ఇంద్రసేనారెడ్డి, కడారి అంజయ్య, మాజీ మండల అధ్యక్షులు, సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారుమూల గ్రామాల్లో లైబ్రరీలు ఏర్పాటు చేస్తాం

# -- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.. ఐపీఎస్

### 500 పుస్తకాలతో దేవుల్ నాయక్ తండాలో లైబ్రరీ ఏర్పాటు..

సోనాల ప్రజా దర్బార్ 27 అక్టోబర్:సోనాల మండలం దేవుల్ నాయక్ తండ గ్రామంలో అదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లైబ్రరీని ప్రారంభించారు.మారుమూల గ్రామాల యువతకు విద్యా, ఉపాధి అవకాశాలను చేరువ చేయడంతో పాటు, వారిని ప్రభుత్వ ఉద్యోగాల సాధన దిశగా ప్రోత్సహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దేవుల్ నాయక్ తండాలో మూడవ లైబ్రరీని ప్రారంభ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ దాదాపు 500 పుస్తకాలతో ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీ చుట్టుపక్కల ఆరు గ్రామాలకు చెందిన సుమారు 1,000 మంది యువతకు ఉపయోగపడుతుందని, దేవుల్ నాయక్ తండా, పూల్ సింగ్ నాయక్ తండా, ప్రార్డీ బి, పార్డ్ కె, సంపత్ నాయక్ తండాతో పాటు పరిసర గ్రామాల యువతకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు, జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ లైబ్రరీ ఎంతగానో ఉపయోగపడుతుందని, యువతి, యువకులు లైబ్రరీ ను ఉపయోగ పరుచుకోవాలని, మారుమూల గ్రామాల్లోని యువతకు చదువుకునే అవకాశాలను వారి గ్రామాల్లోనే అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సరైన మార్గదర్శకత్వం, చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తే గ్రామీణ యువత కూడా ఉన్నతమైన లక్ష్యాలను సాధించగలరని పేర్కొన్నారు. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువుపై దృష్టి సారించి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలకు, గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. యువతలో సానుకూల ఆలోచనలు పెంపొందించడం, వారిని నేరాల వైపు వెళ్లకుండా సరైన మార్గంలో నడిపించడం, సమాజ అభివృద్ధిలో భాగస్వాములను చేయడం కూడా కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగమని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా లో లోకారి,చించుఘాట్ లలో లైబ్రరీలను ఏర్పాటు చేయగా ఇది మూడవ లైబ్రరీ కావడం విశేషం.జిల్లాలోని మారుమూల గ్రామాల యువతకు మరిన్ని విద్యా అవకాశాలు కల్పించేందుకు భవిష్యత్తులో కూడా లైబ్రరీలను ఏర్పాటు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. యువత అభ్యున్నతికి, ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలను అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, బోథ్ సీఐ డి. గురుస్వామి, ఎస్ఐ వి. పురుషోత్తం, సర్పంచ్ జాదవ్ బాబు సింగ్, నాయక్ రామ్ కిషన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## నీటిని పొదుపుగా వాడుకోవాలి

యాదాద్రి(బీబీనగర్) అక్టోబర్ 27 ప్రజాదర్బార్ : గ్రామంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని బీబీనగర్ మండల పరిధిలోని మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్ అన్నారు. మంగళవారం గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ నీ ఓ ప్రభావంతో వర్షాకాలం కరువు వచ్చిన సందర్భంగా ఇక ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతి ఇంటిలో నల్లాలకు ఆన్ ఆఫ్ టాప్ బిగించుకోవాలని, ఇంటిలోఇంకుడు గుంత నిర్మించుకోవాలి, పొలంలో ఉపాధి హామీ కూలీలచే పంట కుంట తొవ్వుకోవాలి, కరెంటును పొదుపుగా వాడుకోవాలని, రైతులు వరి పంట కాకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెవుల భవాని కరుణాకర్రెడ్డి, దేవాలయ చైర్మన్ కందాడి రమణమ్మ బాల్రెడ్డి, వార్డు సభ్యులు గాండ్ల రమేష్, మునిగాల నాగమణి జంగయ్య, మునిగాల కృష్ణ, దండెం జహంగీర్ మరియు వివిధ శాఖల అధికారులు ఎంపీఓ, ఏపీఓ, ఏఈఓ, విద్యుత్ శాఖ, నీటి శాఖ గ్రామపంచాయతీ కార్యదర్శి కిషోర్ రెడ్డి, దేవాలయ ధర్మకర్త బాధని ఆంజనేయులు గౌడ్, గ్రామ పెద్దలు ఆకుల శ్రీనివాస్, కందాడి భూపాల్ రెడ్డి, వెంగళ భూపాల్ రెడ్డి, చెవుల సత్తిరెడ్డి, ఎలిమినేటి స్వామి రెడ్డి, గాండ్ల బిక్షపతి, మహిళా సంఘం అధ్యక్షురాలు సప్పిడి పావని, ఆశా వర్కర్ చెవుల అనిత, వి బి కే దండెం పుణ్యవతి, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ - 19 జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు ప్రారంభం

దోమకొండ అక్టోబర్ 27 ( ప్రజా దర్బార్ )కామారెడ్డి జిల్లా దోమకొండ గడి కోట ఆవరణలో మంగళవారం అండర్ - 19 జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలను సర్పంచ్ ఐరేని నరసయ్య ఆర్చరీ అధ్యక్షులు తీగల తిరుమల్ గౌడ్ లు కలిసి ప్రారంభించారు. కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పాఠశాల క్రీడా సమాఖ్య ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో అండర్-19 జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన 9 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో దీక్షిత్, రామ్ చరణ్, సందీప్, నరేందర్ లు ఎంపికయ్యారు. ఇండియన్ రౌండ్ బాలికల విభాగంలో ఇష్టమహి, దీపిక, దివ్యలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. రికర్వ్ రౌండ్ బాలుర విభాగంలో అనుదీప్ ఎంపికయ్యా డు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారు లను కోట వారసులు కామినేని అనిల్ కుమార్ , దోమకొండ సర్పంచ్ ఐరేని నర్సయ్య, కామారెడ్డి ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల తిరుమల్ గౌడ్, కార్యదర్శి కదిరే మోహన్ రెడ్డి, కోశాధికారి గంగాధర్, ఉప సర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్ ఆర్చరీ కోచ్ ప్రతాప్ దాస్, పెరై నాయక్ లు అభినందించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ: రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ క్రీడా కారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# విద్యార్థుల వికాసానికి ఆచరణాత్మక విద్యను అందించాలి

## - కేజీబీవీలో మౌలిక వసతులు కల్పిస్తాం-

## విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



ముధోల్ నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 27(ప్రజా దర్బార్): విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, నిత్యజీవిత అనుభవాలతో అనుసంధానం చేసుకొని నేర్చుకునేలా ఆచరణాత్మక బోధన అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. మంగళవారం కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహ ప్రాంగణంలో ప్రతిరోజూ మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని పూటలా నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం వందకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహంలోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.4.80 లక్షలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. డ్రైనేజీ నిర్మాణంతో పాటు అవసరమైన ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోతుల బెడద నివారణకు సోలార్ కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు. తరగతి గదుల్లో విద్యార్థుల అవసరాన్ని బట్టి ప్రాధాన్యత క్రమంలో బెంచీలు సమకూరుస్తామని పేర్కొన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జీవశాస్త్రంలోని ఒక అంశాన్ని స్వయంగా బోధించి, విద్యార్థులను ప్రశ్నలు అడుగుతూ వారి అవగాహనను పరిశీలించారు. పాఠ్యాంశాలను నిత్యజీవితంలోని అంశాలతో అనుసంధానం చేసుకొని చదివితే విషయ పరిజ్ఞానం మరింత మెరుగుపడుతుందని విద్యార్థులకు సూచించారు. వివిధ రకాల కూరగాయలను తెప్పించి వాటి బరువును విద్యార్థులతో ముందుగా అంచనా వేయించారు. అనంతరం తూనిక యంత్రంతో బరువును కొలిపించి సరైన అంచనా వేసిన విద్యార్థులను అభినందించారు. వారికి పెన్నులను బహుమతులుగా అందించారు. నిత్యజీవితంలోని చిన్న చిన్న అంశాల నుంచి కూడా విజ్ఞానాన్ని పొందాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీఓ శోభన, ఎంఈఓ ముత్యం, సర్పంచ్ దశరథ్, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొట్టిన కారు.. రోడ్డు ప్రమాదంలో

# మహిళ మృతి, భర్తకు తీవ్ర గాయాలు







మాడుగులపల్లి( ప్రజా దర్బార్)అక్టోబర్ 27 :- హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరిన దంపతుల ప్రయాణం తీవ్ర విషాదాన్ని నింపింది. అతివేగంగా వచ్చిన కారు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆటోను బలంగా ఢీకొనడంతో ఓ వివాహిత దుర్మరణం చెందగా, ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఈ హృదయవిదారక ఘటన నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం పెద్ద గొట్టిపాడు గ్రామానికి చెందిన కుంభ వెంకటేశ్వర్లు (44), కుంభ కోటేశ్వరి (42) దంపతులు హైదరాబాద్ నుంచి తమ స్వగ్రామానికి ఆటోలో ప్రయాణమయ్యారు. మంగళవారం మండలంలోని కొత్తగూడెం శివారులోకి రాగానే, వెనుక వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఒక కారు ఆటోను అత్యంత బలంగా ఢీకొట్టింది. కారు ఢీకొన్న తీవ్రతకు ఆటో అదుపుతప్పి రెండు పల్టీలు కొట్టి రోడ్డు పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు ఇద్దరికీ తీవ్ర రక్తగాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే మానవత్వం చాటుకుంటూ స్పందించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ల ప్రాథమిక చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో కుంభ కోటేశ్వరి పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయింది. తీవ్ర గాయాలతో ఉన్న భర్త వెంకటేశ్వర్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ రోడ్డు ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉపాధి కూలీల నిర్వాకం: పామాయిల్ తోట నరికివేత

ఉట్నూరు, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): ఉట్నూరు మండలం బిజ్జార్ గ్రామం నుంచి ఉట్నూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన రోడ్డుకు 15 మీటర్ల దూరంలో ఉన్న పామాయిల్ తోటను ఉపాధి హామీ కూలీలు నరికివేయడం కలకలం రేపింది.

రోడ్డు పక్కన పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేస్తున్న కూలీలు తోటలోకి ప్రవేశించి పామాయిల్ మొక్కలను ఇష్టారాజ్యంగా నరికివేశారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.ఏళ్ల తరబడి అప్పులు చేసి సాగు చేస్తున్న తోటను ఒక్కసారిగా ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు వాపోయాడు. ఉపాధి హామీ పనుల పేరుతో రైతుల పంటలను నాశనం చేయడం సరికాదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేపట్టే ముందు ఫీల్డ్ అసిస్టెంట్, అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై బాధిత రైతు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. నష్టపరిహారం చెల్లించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

## శ్రీ మత్స్యగిరి ఆలయంలో హుండీలు లెక్కింపు

యాదాద్రి(అక్టోబర్ 27)వలిగొండ ప్రజాదర్బార్ న్యూస్: మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహా స్వామీ ఆలయంలో మంగళవారం దేవాదాయ ధర్మాదాయ అధికారి వెంకటలక్ష్మి పర్యవేక్షణలో హుండీలు లెక్కించారు.91 రోజులకు గాను 9 లక్షల 93 వేల 07 రూపాయలు లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె వెంకటయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ తుమ్మల శ్రీనివాస్,ధర్మకర్తలు,వేద పండితులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అనుమతులు, రక్షణ ప్రమాణాలు లేని టపాసులు పట్టివేత.

స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 27 ( ప్రజాదర్బార్ ) :- స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం టాస్క్ ఫోర్స్, ఘనపూర్ పోలీస్ ల సంయుక్త దాడులు చేపట్టారు. ఈ దాడులలో ప్రభుత్వ అనుమతులు లేకుండా , తగిన రక్షణ ప్రమాణాలు పాటించకుండా టపాసులు నిల్వ చేశారనే నమ్మదగిన సమాచారం మేరకు శివునిపల్లి లోని బెల్లి సంతోష్ షాప్ లో 4,08,000/- రూపాయలు విలువ గలవి పార్శి యశ్వత్ షాప్ లో 5,29,830/-రూపాయలు విలువ గలవి ఎస్సి కాలనీ లోనిఆకుల గోపాల్ షాప్ లో 2,75,000/-రూపాయలు విలువ గల టపాసులు స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

## అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ప్రజాదర్బార్ అక్టోబర్ 27: ప్రజల రక్షణ,శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,ఎస్పీ అక్షాన్ష్ యాదవ్,అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ ర్యాలీలో పాల్గొన్నారు.మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగి రైల్వే స్టేషన్ వద్ద ముగిసింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రత కోసం పనిచేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.వారి సేవలను ప్రజలకు గుర్తుచేయడంతో పాటు పోలీసు శాఖ విధులు,బాధ్యతలపై అవగాహన కల్పించడం, పోలీసులకు--ప్రజలకు మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడం సైకిల్ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత,విద్యార్థులు,ప్రజలు భాగస్వాములై అమరవీరులకు ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్ నాయుడు,రవీందర్,సురేష్‌తో పాటు జిల్లాలోని సీఐలు,ఆర్ఐలు,ఎస్‌హెచ్‌ఓలు,ఎస్ఐలు,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

# కేంద్రం 50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ రాష్ట్రానికి ఇవ్వాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నాగయ్య.

మహబూబాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 27 (ప్రజాదర్బార్): ఎల్ నీ నో తో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాను కరువు జిల్లా గా వెంటనే ప్రకటించాలని, అందుకోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే 50వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య కోరారు. మంగళవారం గుణగంటి రాజన్న అధ్యక్షతన జరిగిన సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో నాగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణ స్పందించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కరువు సహాయ చర్యల కోసం ఎంత నిధి అవసరము నివేదికలను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సూచనలు పంపాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్రంలో కరువు నివారణ చర్యల కోసం తక్షణం 50 వేల కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పొట్టకొచ్చిన వరి పంటను రక్షించేందుకు సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఇప్పటికే వేసిన పంటలను కాపాడేందుకు విద్యుత్ కోత లేకుండా చూడాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. నష్టపోయిన పంటలకు వరికి 30వేలు, పత్తి, మిర్చికి 50 వేలు, ఇతర పంటలకు 20వేల చొప్పున నష్టపరిహారం అందివ్వాలని కోరారు. గ్రామాల్లో పట్టణాల్లో తాగునీటి సమస్య రాకుండా నివారించేందుకు ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరారు. రేషన్ కార్డు పై ఒక్క వ్యక్తికి 12 కేజీల బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులు అందజేయాలని అన్నారు. రాష్ట్రంలో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని వాటి నియంత్రణకు ప్రత్యేకమైన నిఘా కమిటీ వేయాలని కోరారు. కరువు నేపథ్యంలో ఉపాధి హామీ పనుల్ని రెండు వందల రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. రైతు భరోసాను కూడా రెట్టింపు చేయాలని, రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించి వారికి పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టి వెంకన్న, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.




## చింతలపాలెం మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బైక్ ర్యాలీ




సూర్యాపేట జిల్లా/చింతలపాలెం/అక్టోబర్27(ప్రజాదర్బార్)పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని చింతలపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రోజున ఎస్సై పరమేష్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈ ర్యాలీని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలోపోలీస్ సిబ్బంది, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో బైక్‌లపై జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని పోలీస్ అధికారులు తెలిపారు. పోలీస్ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ భూముల ఆక్రమణలను సహించేది లేదు

## – ధర్మసాగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి:కలెక్టర్

నిర్మల్, అక్టోబర్ 27(ప్రజాదర్బార్, ప్రతినిధి) జిల్లాలో నీటిపారుదల శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మంగళవారం పట్టణంలోని ధర్మసాగర్ చెరువు ఎఫ్‌టీఎల్ (పూర్తి నీటిమట్టం) పరిధిలో ఆక్రమణలను కలెక్టర్ పరిశీలించారు. చెరువుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, మ్యాపులను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసేందుకు చేపట్టిన నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు.ధర్మసాగర్ చెరువు వద్ద అనధికారికంగా నిర్మించిన లేఅవుట్ ఫెన్సింగ్ గోడను అధికారులు కూల్చివేశారు. వెంచర్ నిర్మాణ పనులకు వినియోగిస్తున్న యంత్రాలు, సామగ్రి, ఇసుక తదితర వస్తువులను స్వాధీనం చేసుకుని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోని నీటిపారుదల శాఖ భూములు, చెరువుల పరిధిలో ఆక్రమణలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆక్రమణలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో నీటిపారుదల శాఖ ఈఈ అనిల్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహశీల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఓటు హక్కు పరిరక్షణతోనే ప్రజాస్వామ్యానికి రక్షణ

చేవెళ్ల, అక్టోబర్ (ప్రజాదర్బార్): ఓటు హక్కును పరిరక్షించుకోవడం అంటే భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని చేవెళ్ల మాజీ సర్పంచ్, మాజీ సర్పంచుల సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి స్థానిక కౌన్సిలర్ బందారి శైలజ ఆగిరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఆ హక్కును హరించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు 'ప్రజాదర్బార్'తో మాట్లాడారు.దేశంలో మరోసారి అధికారంలోకి రావడానికి భాజపా అడ్డదారులు తొక్కుతోందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కోట్లాది ఓట్లను తొలగిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకూడదని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కునుే శక్తి అని పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోతే ప్రజాస్వామ్య ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యం దెబ్బతింటుందని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ఓటు హక్కును కాపాడటం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని సూచించారు.దేశంలో కీలక సంస్కరణలు చేపట్టి ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని తెలిపారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు అమరం...వారి సేవలు చిరస్మరణీయం

సూర్యాపేట జిల్లా/హుజూర్ నగర్ ।అక్టోబర్27:(ప్రజాదర్బార్) పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలో స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ చలికంటి నరేష్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. శాంతిభద్రతల పట్ల పోలీసులకున్న నిబద్ధతను అమరుల పట్ల ఉన్న గౌరవాన్ని చాటిచెప్పిన ఈ బైక్ ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ?ప్రజల రక్షణ శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ శ్రీరాములు సెంటర్ నుండి ఇందిరా చౌక్ వరకు వలయాకారంగా సాగిన ఈ బైక్ ర్యాలీలో పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ చలికంటి నరేష్ మాట్లాడుతూ... సమాజంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రజల భద్రత కోసం తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు వెలకట్టలేనివన్నారు వారి త్యాగాలు స్మరణీయమని వారి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు నిరంతరం సేవలు అందించడమే మనం వారికిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ హనుమాన్, స్థానిక పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# కనగల్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

## పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం- నాణ్యమైన దర్యాప్తు,- ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలి -- జిల్లా ఎస్పీ



నల్గొండ అక్టోబర్ 26(ప్రజా దర్బార్ ) నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మంగళవారం కనగల్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న జిల్లా ఎస్పీ గారికి పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, సిబ్బంది విధుల నిర్వహణ, రికార్డు గదులు, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది కిట్ తదితర అంశాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులు, కోర్టు కేసుల వివరాలను సమీక్షించి, కేసుల దర్యాప్తు పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, అవసరమైన సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించాలని, నిర్ణీత సమయంలో చార్జిషీట్లు దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని, కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే క్రైమ్ రిజిస్టర్, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, కేసు డైరీ ఫైల్స్, కోర్టు కేసుల రికార్డులు, స్టేషన్ రికార్డులు, బీట్ బుక్స్ తదితర రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, గతంలో నేరాలు జరిగిన ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను గౌరవంగా విని, చట్టపరిధిలో తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తక్షణ పోలీస్ సేవలు అందించాలని తెలిపారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా పెరిగేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. కనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు వివరించాలని తెలిపారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేసి నేరాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలపై జరిగే నేరాల విషయంలో తక్షణమే స్పందించి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది సంక్షేమానికి సంబంధించిన అంశాలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధులు, సెలవులు, వసతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు తెలుసుకుని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, పారదర్శకత పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ఫిర్యాదుల సత్వర పరిష్కారం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సూచించారు. ఈ వార్షిక తనిఖీలో జిల్లా ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,ఎస్బి సీఐ నాగరాజు,చండూర్ సీఐ రాము, డీసీఆర్బీ సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ రాజీవ్ రెడ్డి, సంబంధిత పోలీస్ అధికారులు, కనగల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమనగల్‌లో ప్రమాదకర బ్లాక్ స్పాట్లపై ట్రాఫిక్ డీసీపీ తనిఖీ

రంగారెడ్డి బ్యూరో 27 అక్టోబర్ (ప్రజాదర్బార్):- అమనగల్ పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ పట్టణంలోని ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాలు, ప్రమాదకర బ్లాక్ స్పాట్లతో పాటు జాతీయ రహదారి--765 (ఎన్‌హెచ్--765)ను సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారులపై ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను, ట్రాఫిక్ సమస్యలను అధికారులు డీసీపీ దృష్టికి తీసుకెళ్లారు. రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే దుకాణాలు, ఆక్రమణలను తొలగించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీసీపీ అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, సంబంధిత శాఖలు




సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సీఐ శంకరయ్య, అమనగల్ ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు, మహేశ్వరం ట్రాఫిక్ సీఐ అశోక్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# జంతు సంక్షేమంపై అవగాహన అవసరం : మార్స్ పేట్ కేర్

హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్) : భారత్‌లో పెంపుడు జంతువులను దత్తత తీసుకోని యజమానుల్లో 25 శాతం మంది సరైన మార్గదర్శకత్వం లభిస్తే దత్తతకు సిద్ధంగా ఉన్నారని మార్స్ సర్వే వెల్లడించిందని మార్స్ పెట్ న్యూట్రిషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ స్యాగ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మార్స్ ఫ్యాక్టరీలో ఆస్రా, బ్లూ క్రాస్ హైదరాబాద్ సహకారంతో గ్లోబల్ అడాప్షన్ వీకెండ్ నిర్వహించగా, ఓ ఉద్యోగి కుక్కపిల్లను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. 2,000 మందిపై నిర్వహించిన సర్వేలో జంతువుల వైద్య చరిత్ర, ప్రవర్తనపై సందేహాలు ప్రధాన అడ్డంకులుగా గుర్తించినట్లు తెలిపారు. జంతు సంక్షేమంపై అవగాహన అవసరమని తెలిపారు. వాల్థమ్ పెట్‌కేర్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ నిపుణుల సహకారంతో మార్స్ ఆన్‌లైన్ అడాప్షన్ హబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 2026లో ఈ కార్యక్రమాన్ని 30కి పైగా దేశాలకు విస్తరించిందని పేర్కొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేసిన సర్పంచ్

చిట్యాల అక్టోబర్ 27 (ప్రజాదర్బార్)చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న షూలను సర్పంచ్ పాలెం మహేష్ గౌడ్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన సమ్మేటివ్ అసెస్‌మెంట్--1లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు భారతీ చిల్డ్రన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గుండ్రాంపల్లి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి లిలిపైళ్ల రవీందర్‌లిలి బహుమతులు అందజేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ అందించిన సహకారాన్ని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణశివ, అనసూయ,మౌనిక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలి

స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 27 ( ప్రజాదర్బార్ ) :- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుని మంగళవారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత పరిస్థితులు, పార్టీ కార్యక్రమాల అంశాలపై కేటీఆర్ కి సమగ్రంగా వివరించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డాక్టర్ తాటికొండ రాజయ్య కోరారు. పార్టీ బలోపేతానికి విఘాతం కలిగించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బోడుప్పల్ హైస్కూల్ విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన

## - పిల్లల భద్రతపై ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### – మేడ్చల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్




మేడిపల్లి,అక్టోబర్ 27 (ప్రజాదర్బార్) : పిల్లలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని మేడ్చల్ జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి బాలభాస్కర్ సూచించారు.పిల్లల భద్రత, హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మంగళవారం బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టం–2012పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్, జిల్లా పోలీసు అధికారి ప్రియాంక,మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐ డి.జలేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు పోక్సో చట్టం–2012లోని ముఖ్య నిబంధనలు,బాలలపై లైంగిక నేరాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు, పిల్లలకు చట్టం కల్పిస్తున్న రక్షణ గురించి వివరించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించడం, అనుమానాస్పద పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండటం, వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యమివ్వడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.లైంగిక వేధింపులకు గురైనప్పుడు పిల్లలు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. పిల్లలు తమకు ఎదురైన ఇబ్బందులను స్వేచ్ఛగా వెల్లడించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలపై జరిగే లైంగిక నేరాలకు సంబంధించి పోక్సో చట్టం వర్తిస్తుందని వివరించారు.మహిళలు, బాలికల భద్రతలో షీ టీమ్స్ కీలక పాత్రమహిళలు, బాలికల భద్రతను కాపాడటంలో షీ టీమ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు తెలిపారు. వేధింపులకు గురైనప్పుడు ఫిర్యాదు చేసే విధానం, పోలీసుల సహాయం పొందే మార్గాల గురించి విద్యార్థులకు వివరించారు. బాలల హక్కుల పరిరక్షణ, లైంగిక నేరాల నివారణ, చట్టాలపై సమాజంలో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.పిల్లల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద ఘటన లేదా వేధింపుల విషయం దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్. నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు




మోమిన్ పేట అక్టోబర్ 27 ప్రజాదర్బార్. మోమిన్ పేట మండల పరిధిలోని చిమలదరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉత్తమ గ్రామపంచాయతీ జాతీయ అవార్డు గ్రహీత, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎన్. నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మోమిన్ పేట సమీపంలోని బీకేఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ వేడుకలకు వికారాబాద్ జిల్లా బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు నరసింహారెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మోమిన్ పేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దబ్బాని వెంకట్తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను సందడిగా నిర్వహించారు. నరసింహారెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలనుఅధిరోహించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

# అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి పల్లా సుందర్ రాంరెడ్డి ఆర్థిక చేయూత

## - తక్షణ సాయంగా రూ.20 వేలు అందజేత-ఆరు నెలల పాటు డయాలసిస్ ఖర్చులు భరిస్తానని హామీ

దేవరుప్పుల, అక్టోబర్ 27 (ప్రజాదర్బార్): రెండు మూత్రపిండాలు దెబ్బతిని తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కార్యకర్త కుమార్తె వైద్య చికిత్సకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి ఆర్థిక చేయూత అందించారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాపాక సురేందర్ కుమార్తె శ్రీనిక చికిత్స కోసం తక్షణ సాయంగా రూ. 20 వేలు అందజేయడంతో పాటు ఆరు నెలల పాటు డయాలసిస్ ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు. సింగరాజుపల్లి గ్రామానికి చెందిన రాపాక సురేందర్, శ్రీలత దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె శ్రీనిక పదో తరగతి చదువుతోంది. రెండు మూత్రపిండాలు దెబ్బతినడంతో ఆమె తీవ్ర అనారోగ్య సమస్యను ఎదుర్కొంటోంది. కుమార్తె ఆరోగ్య పరిస్థితి కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తుండగా, వైద్య చికిత్సకు అవసరమైన ఖర్చులు భరించడం వారికి ఆర్థిక భారంగా మారింది. ఆమె ఆరోగ్య పరిస్థితి, ఇప్పటివరకు అందించిన వైద్యం, తదుపరి చికిత్సకు అవసరమైన ఖర్చుల వివరాలను తండ్రి సురేందర్ను అడిగి తెలుసుకున్నారు. శ్రీనికకు వారానికి రెండుసార్లు చొప్పున సుమారు ఆరు నెలల పాటు డయాలసిస్ చేయించాల్సి ఉందని, ఇందుకోసం వారానికి దాదాపు రూ.12 వేల వరకు ఖర్చవుతుందని సురేందర్ వివరించారు. ఇప్పటికే చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన తెలిపారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పల్లా సుందర్ రాంరెడ్డి వెంటనే స్పందించి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అంతేకాకుండా శ్రీనికకు అవసరమైన డయాలసిస్ చికిత్స కోసం వారానికి సుమారు రూ.12 వేల చొప్పున ఆరు నెలల పాటు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. చిన్న వయసులోనే తీవ్రమైన అనారోగ్య సమస్యను ఎదుర్కొంటున్న కుమార్తె చికిత్స కోసం ఆందోళన చెందుతున్న సమయంలో అందిన ఈ ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి కొంత ఊరటనిచ్చింది. చికిత్స ఖర్చులకు సంబంధించి పల్లా సుందర్ రాంరెడ్డి ఇచ్చిన హామీతో కుటుంబ సభ్యుల్లో ధైర్యం పెరిగింది. కష్టకాలంలో తమ ఇంటికి వచ్చి పరామర్శించడంతో పాటు కుమార్తె వైద్య చికిత్సకు అండగా నిలిచిన పల్లా సుందర్ రాంరెడ్డికి సురేందర్, శ్రీలత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు



# ఆరుతడి పంటలకు ప్రాధాన్యతను ఇవ్వండి

లోకేశ్వరం అక్టోబర్ 27 (ప్రజా దర్బార్)యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యతను ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి గిరిరాజ్ రైతులకు సూచించారు. 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులతో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం జరిగా యని దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలైనటువంటి వేరుశనగ,జొన్న, మినుములు,నువ్వులు, పెసర,శనగ, పొద్దుతిరుగుడు, ఆముదం, కుసుమ, ఆవాలు వంటి పంటలకు ప్రాధాన్యతని వ్వాలని సూచించారు. నానో ఎరువుల వినియోగం వాటి ప్రయోజనాల రైతులకు గురించి వివరించారు. అదేవిధంగా యాసంగి పంటలు, యాజమాన్య పద్ధతులపై బుక్లెట్ విడుదల చేశారు. మండల వ్యవసాయ విస్తరణ మౌనికతో పాటు రైతులు పాల్గొన్నారు.



# మునుగోడులో ఓటరు జాబితాను పరిశీలించిన దేవసేన

మునుగోడు అక్టోబర్ 27 (ప్రజా దర్బార్) ఓటర్ జాబితా జిల్లా పరిశీలకురాలు కళాశాల మరియు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన మంగళవారం మునుగోడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మండల కేంద్రంలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన 171 వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. అక్కడి సిబ్బంది నిర్వహిస్తున్న ప్రక్రియను సమీక్షించారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న పనితీరును సమీక్షించి ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి పారదర్శకతతో సవరణలు చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని ప్రజల నుండి వచ్చే అభ్యర్థనలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత కీలకమని కచ్చితంగా ఓటరు జాబితా తయారీకి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ప్రాణాలతో యాజమాన్యాలు చెలగాటం

## క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువు-పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రైస్ మిల్లులు




మిర్యాలగూడ/వేములపల్లి అక్టోబర్ 27 ప్రజాదర్బార్ :- తెలంగాణలోని రైస్ మిల్లుల్లో యజమాన్యాలు కార్మికుల ప్రాణరక్షణ, పని ప్రదేశంలో భద్రత, పారిశుద్ధ్యం, వేతనాలు, పని గంటలు వంటి అంశాల్లో వర్తించే చట్టాలు నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా యంత్రాల వద్ద పనిచేసే కార్మికులు, బాయిలర్ విభాగంలో పనిచేసేవారు ధాన్యం లోడింగ్ , అన్లోడింగ్ చేసే సిబ్బందికి ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు యాజమాన్యాలు చేయాలి. కానీ మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో ఉన్న మిల్లుల్లో ఇలాంటి నిబంధనలు కనిపించడం లేదు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిర్యాలగూడ పట్టణం అంటేనే రైస్ మిల్లులకు పెట్టింది పేరు. రోజురోజుకు పుట్టగొడుగుల రైస్ మిల్లులు పుట్టుకొస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైస్ మిల్లర్లకు అధికారుల , ప్రజాప్రతినిధుల అండదండలు మెండుగానే ఉన్నాయని చర్చ జరుగుతుంది. అందుకే కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరిగిన ఆలస్యం చేయడం వెనక ప్రజాప్రతినిధులు అధికారుల అండదండలే కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. కార్మికుల భద్రతకు ఎటువంటి సెక్యూరిటీ కల్పించకపోవడంతో కార్మికులు ప్రాణాలు వదిలేస్తున్న సంఘటనలు మిర్యాలగూడ పరిధిలోని రైస్ మిల్లుల్లో తరచూ జరుగుతున్నది. ఈ మిల్లుల యాజమాన్యం కార్మికుడు మృతి చెందితే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది అనే ఆలోచన లేకుండా ధనార్జనే ధ్యేయంగా కార్మికుల ప్రాణాల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తమ వ్యాపారాన్ని లాభాల బాటలో నడుపుకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో గల నూతనంగా నిర్మిస్తున్న మిల్లులో కార్మికులు కిందపడి తీవ్ర గాయాల పాలయ్యారు. రెండు రోజుల క్రితం శెట్టిపాలెం గ్రామ శివారులో గల మహా తేజ మిల్లులో పొట్టులో పడి కార్మికుడు మండల నాగరాజు మృతి చెందారు. ఇలాంటి సంఘటనలు రైస్ మిల్లులో తరచూ జరుగుతూనే ఉన్నాయి. కానీ అధికారులు ఎలాంటి తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి కార్మికులకు రక్షణ కల్పించాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పనిచేసే కార్మికులకు పటిష్ట రక్షణ కల్పించాలి. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి నిఘాభద్రత ఏర్పాటు చేస్తున్నారు. కానీ కార్మికులకు ఎలాంటి భద్రత కనిపించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. యజమాన్యాలు ఇప్పటికైనా భద్రత కల్పించాలని మిర్యాలగూడ ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు జిల్లా యాదగిరి కోరారు.

# ఓటు హక్కుల పరిరక్షణ కోసమే ఓట్ బచావో..దేశ్ బచావో..,..

## - ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్.. ఓటరు జాబితాల్లో అవకతవకలు జరగకుండా పారదర్శకత పాటించాలని సూచన

ఆదిలాబాద్ ప్రజాదర్బార్ ప్రతినిధి అక్టోబర్27: ఓటరు హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటం,ఓటరు జాబితాల్లో పారదర్శకతను నిర్ధారించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో ఓట్ బచావో -- దేశ్ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్, కార్యక్రమ కోఆర్డినేటర్ శ్రావణ రావు,ఆదిలాబాద్ నియోజకవర్గ ఏఐసీసీ అబ్జర్వర్ కొటనాక్ తిరుపతి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ నాయకత్వం లో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ, దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.అనంతరం ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలగాలంటే ఓటరు జాబితాల రూపకల్పన, సవరణ ప్రక్రియలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును కాపాడటం, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కీలకమని తెలిపారు. రాహుల్ గాంధీ సిఈసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని చేస్తున్న పోరాటం ప్రజాస్వామ్య బద్ధమైనదని, జ్ఞానేష్ కుమార్ కొన్ని కోట్ల ప్రజల ఓటు హక్కును ప్రమాదంలోకి నెట్టివేసారని సీఈసీ బిజెపి ప్రభుత్వం తొత్తుగా పనిచేస్తున్నారని ఆరోపించారు.అందుకే ఓట్ బచావో -- దేశ్ బచావో కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ఓటరు హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ 2లు, కాంగ్రెస్ పార్టీని నియమించిన ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్లు నోటీసులు వచ్చిన ఓటర్లకు అవసరమైన సహకారాన్ని అందిస్తూ వారి ఓటు హక్కు పోకుండా కాపాడే ప్రయత్నం చేయాలని దిశా నిర్దేశం చేశారు.ఇందులో బోథ్ నియోజక వర్గం ఇంచార్జ్ ఆడె గజేందర్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు



శ్రీకాంత్ రెడ్డి,స్థానిక మున్సిపల్ చైర్మన్ బండారి అనూష,మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్, బోథ్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పసుల చంటి తదితరులు పాల్గొన్నారు.

# రైతు గర్జనను విజయవంతం చేయాలి.

ఆదిలాబాద్ టౌన్ ప్రజాదర్బార్ అక్టోబర్ 27: రైతు గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వార్డు కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, ప్రజలను తరలించే అంశాలపై చర్చించారు.నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఆదిలాబాద్‌లోని డైట్ మైదానంలో రైతు గర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ..

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రైతు గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, నవంబర్ 1న డైట్ మైదానంలో నిర్వహించే రైతు గర్జన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొజ్జ సంతోష్ దారవేణి రాము,బొట్టు రమేష్, నర్సా గౌడ్,ప్రదీప్,కుర్షిద్, బబ్లు, పవన్, సతీష్ జావీద్,శేఖర్,అశోక్, ప్రమోద్, సాయిని ప్రవీణ్,మున్ని, రమ, రాజన్న,తోపిక తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలోకి కారింగుల శ్రీనివాస్ గౌడ్..!!

ప్రజాదర్బార్,మోతె, అక్టోబర్ 27 మోతె మండల పరిధిలోని రాఘవపురం ఎక్స్‌రోడ్ గ్రామానికి చెందిన నాయకుడు కారింగుల శ్రీనివాస్ గౌడ్ తన అభిమానులు, అనుచరులతో కలిసి శ్రీమతి కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. సూర్యాపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కుందూరు దేవేందర్ రెడ్డి, కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా సంజీవరావు నాయక్, మండల నాయకుడు ధరావత్ కృష్ణ సమక్షంలో పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

పంచజన్యాల నినాదమే ఆకర్షణ...

తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రజల సంక్షేమం, యువతకు ఉపాధి, రైతుల అభివృద్ధి, సామాజిక సమానత్వం లక్ష్యంగా ముందుకు తీసుకెళ్తున్న పంచజన్యాల నినాదానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు కారింగుల శ్రీనివాస్ గౌడ్ వర్గీయులు తెలిపారు. శ్రీకృష్ణుడు యుద్ధానికి ముందు పూరించిన పాంచజన్యం శంఖం స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఐదు ప్రధాన అంశాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు.

మొదటి పాంచజన్యం.. ఉచిత విద్య.!

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా నాణ్యమైన విద్య అందించడమే ఉచిత విద్య లక్ష్యమని పార్టీ ప్రతిపాదన లో పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాల ల్లోనూ విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా చదువుకునే అవకాశాలు కల్పించాలనేది ఈ అంశం ప్రధాన ఉద్దేశమని వివరించారు. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు విద్యను అందుబాటులోకి తీసుకురా వడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు.

రెండో పాంచజన్యం.. ఉచిత వైద్యం.!

వైద్యం వ్యాపారంగా మారుతున్న పరిస్థితుల్లో సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని పార్టీ నేతలు అభిప్రాయపడు తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ప్రజలకు ఆర్థిక భారం లేకుండా వైద్య సేవలు అందించాలనే లక్ష్యాన్ని ఉచిత వైద్యం అంశం ద్వారా ముందుకు తీసుకెళు తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాలు అనారోగ్యానికి గురైనప్పుడు అప్పులపాలవకుండా నాణ్యమైన వైద్యం పొందేలా వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు.

మూడో పాంచజన్యం.. వ్యవసాయం.!

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతును రాజుగా చూడాలనేది పంచజన్యాల్లో మూడో అంశమని వివరించారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, అవసరమైన వ్యవసాయ సదుపాయాలు కల్పించడంతో పాటు నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాగునీటి సమస్యలను పరిష్కరించి, రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవడమే వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశమని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో యువత కీలక పాత్ర పోషించిందని, అనేక మంది ఉద్యమకారులు తమ విలువైన యువ జీవితాన్ని ఉద్యమానికే అంకితం చేశారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు

### ఆత్మవిశ్వాసమే ఆయుధం.. స్వీయగౌరవమే బలం

# మహిళా పోలీసుల సాధికారతకు ప్రత్యేక శిక్షణ

## నల్గొండలో రెండు రోజుల అవగాహన కార్యక్రమం ప్రారంభం




రాజేంద్రనగర్,అక్టోబర్ 27(ప్రజాదర్బార్)విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా అధిగమిస్తూ, ఆత్మవిశ్వాసం, స్వీయగౌరవంతో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ శరద్ చంద్ర పవార్ మహిళా పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు.మహిళా పోలీసుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు నల్గొండలో రెండు రోజుల అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.తెలంగాణ పోలీసు అకాడమీ,ఉమీద్ సంస్థ సంయుక్తంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. వ్యక్తిగత,వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కోవడం, లింగ వివక్షను అధిగమించడం,తమ సామర్థ్యాలను గుర్తించడం, లక్ష్యసాధనపై మహిళా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..మహిళా పోలీసులు తమలోని నైపుణ్యాలను గుర్తించి, స్పష్టమైన లక్ష్యాలతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.సామాజిక మూస ధోరణులకు వెరవకుండా ఆత్మగౌరవంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్,మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి. మంజుల,50 మంది మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.తెలంగాణ పోలీసు అకాడమీ తరఫున సమన్వయకర్త డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు, ఉమీద్ సంస్థ ప్రతినిధులు రెహమత్,హనిత,తాన్య, శర్మ అవగాహన తరగతులు నిర్వహించారు.

# ముదిరాజుల చేరికపై నాయి బ్రాహ్మణుల నిరసన

### – అదనపు కలెక్టర్‌కు వినతి



ములుగు, అక్టోబర్ 27 (ప్రజాదర్బార్): ములుగు జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుగొండ సతీష్ ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం ఆదేశాల మేరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం మోహన్ కుమార్ మాట్లాడుతూ, బీసీ డీలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులను బీసీ ఏలో చేరిస్తే ఆ వర్గంలోని 57 కులాల పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని అన్నారు. ఇప్పటికీ ఈ కులాలన్నీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, చదువుకున్న యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. శ్రీకాంత్, కోశాధికారి ఎన్. వేణు, సీనియర్ నాయకులు ఎం. కుమారస్వామి, మండల అధ్యక్షులు సిహెచ్. శివాజీ, ఎన్. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేతో భూ హక్కులకు భద్రత

## రీసర్వే పనుల్లో కచ్చితత్వానికి ప్రాధాన్యం: అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ

### దొరసముద్రంలో భూ రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



మహబూబ్‌నగర్, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): భూ రీసర్వే ద్వారా భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయడంతో పాటు రైతుల భూ హక్కులకు భద్రత కల్పించవచ్చని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ పేర్కొన్నారు. మంగళవారం హన్వాడ మండలం దొరసముద్రం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల రీసర్వే పనుల పురోగతిపై తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి సర్వే నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతులు, ప్రజలతో మాట్లాడిన అదనపు కలెక్టర్ భూ రీసర్వే ప్రాధాన్యతను వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల కొలతలను మరింత కచ్చితంగా నమోదు చేసేందుకు జీపీఎస్ రోవర్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. భూముల వివరాలు స్పష్టంగా నమోదు కావడం ద్వారా భూ హక్కులకు భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. భూ రీసర్వే పనులు పారదర్శకంగా, కచ్చితత్వంతో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే బృందాలకు రైతులు, గ్రామస్థులు పూర్తిస్థాయిలో సహకరించి రీసర్వే పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ హరిప్రియ కోరారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి నాగరమేష్ సాయం



గోవిందరావు పేట, అక్టోబర్ 27 (ప్రజాదర్బార్): మండల పరిధి పసర గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాసరెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆటో దెబ్బతినడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేష్ మానవతా దృక్పథంతో రూ.8 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.పేదల కష్టాల్లో ముందుండే నాగరమేష్ సేవలను గ్రామస్తులు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో లకావత్ నర్సింహా నాయక్, సూడి శ్రీనివాసరెడ్డి,కొమరం ధనలక్ష్మి, చందులాల్, పృథ్వీరాజ్, మాలోత్ గాంధీ, శ్రీనివాస చారి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన భాస్కర్ నాయక్

రాజాపూర్(జడ్చర్ల) ,అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): మిడ్జిల్ మండల పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను స్వచ్ఛంద సేవకుడు భాస్కర్ నాయక్ మంగళవారం జడ్చర్ల వారి కుటుంబ సభ్యులను కలిశారు.ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాదంతో ఆందోళనలో ఉన్న బాధిత కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా నిలిచారు.ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తానన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజాసేవే లక్ష్యమని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే తన ధ్యేయమని పేర్కొన్నారు.ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న భాస్కర్ నాయక్ సేవా దృక్పథం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోందని స్థానికులు కొనియాడారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# గ్రాడ్యుయేట్ ఓట్లు నమోదు చేసుకోండి

## కాంగ్రెస్ యువ నేత పలుగుట్ల చిన్నబాబు పిలుపు

రాజాపూర్,అక్టోబర్ 27 (ప్రజా దర్బార్)మహబూబ్ నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదులో డిగ్రీ, ఆపై చదువుకున్న ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని రాజాపూర్ మండల కాంగ్రెస్ యువ నాయకుడు పలుగుట్ల చిన్నబాబు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదుకు చివరి తేదీ నవంబర్ 6 వరకు మాత్రమే ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారం–18 పూర్తి చేసి ఓటు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామాల్లో ఉన్న చదువుకున్న యువత, ఉద్యోగులు, మేధావులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.యువత చట్టసభల్లో ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ, లాయర్ గా ప్రాక్టీస్ చేస్తూ పార్టీకి వివిధ హోదాల్లో సేవలు అందించిన సామ రామ్మోహన్ రెడ్డిని గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా ప్రకటించడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు.పార్టీ ప్రకటించిన అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపు కోసం స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో పని చేస్తామని చిన్నబాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఎప్పటికప్పుడు నియోజకవర్గ స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తూ ఓటర్ నమోదును వేగవంతం చేస్తున్నారని ఆయన తెలిపారు.



# నూతన మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

అడ్డాకుల, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): అడ్డాకుల మండల కేంద్రంలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అడ్డాకుల మండల రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు మహబూబ్‌నగర్, జడ్చర్ల, వనపర్తి, మదనాపురం ప్రాంతాల్లోని మార్కెట్ యార్డులకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో రవాణా ఖర్చులు పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి అడ్డాకుల మండల కేంద్రంలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటు ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మార్కెట్ యార్డు అందుబాటులోకి వస్తే అడ్డాకుల, మూసాపేట,



భూత్పూర్ మండలాల రైతులకు తమ పంట ఉత్పత్తులను స్థానికంగానే విక్రయించుకునే అవకాశం కలుగుతుందని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతుల సమస్యను పరిష్కరించే దిశగా చొరవ తీసుకున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి అడ్డాకుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట శ్రీహరి సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మూడు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు విజయ మోహన్ రెడ్డి, సర్పంచ్ దశరథ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ, బాల నరసింహులు, జగ్గయ్య, మాజీ ఎంపీపీ కృష్ణయ్య ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు.

# గడువులోగా భూ రీసర్వే పనులు పూర్తి చేయాలి

## రీసర్వే పనుల్లో వేగం పెంచాలి: రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ

మహబూబ్‌నగర్, టౌన్ అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): మహబూబ్‌నగర్ పట్టణ మండల పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణ మండల తహసీల్దార్ ఘన్సీ రామ్‌తో కలిసి సర్వే నంబర్లు 927, 929, 930, 946లో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని సమీక్షించి, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వే నంబర్ 946లో ప్రభుత్వ భూముల రీసర్వే పనులు, 927, 929, 930 సర్వే నంబర్లలో ఆర్ఐ బృందం ఆధ్వర్యంలో ఆబాది సర్వే, గ్రామ సరిహద్దుల నిర్ధారణ పనులు కొనసాగుతున్నాయని డీటీ బృందం, మండల సర్వేయర్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. భూ సర్వే



పనుల్లో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ నిర్ణీత గడువులోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ హరిప్రియ ఆదేశించారు.

# నీటి లీకేజీని తక్షణమే అరికట్టాలి



మహబూబ్‌నగర్,అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలో నీటి లీకేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం నగరంలోని ఫైర్ స్టేషన్ సమీపంలో టీడీ గుట్ట వద్ద ఏర్పడిన నీటి లీకేజీని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నీరు వృథాగా పోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత ఏఈకి సూచించారు.నీటి సరఫరా వ్యవస్థలో ఏర్పడిన లీకేజీని అరికట్టేందుకు అవసరమైన మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రంలోగా మరమ్మతుల పనులను పూర్తిచేసి, నీటి లీకేజీని పూర్తిస్థాయిలో అరికట్టాలని స్పష్టం చేశారు.నీటి వృథాను నివారించేందుకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

# జన విజ్ఞాన వేదిక మరిపెడ శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

మరిపెడ ప్రజా దర్బార్ అక్టోబర్ 27: –జన విజ్ఞాన వేదిక మరిపెడ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఐనాల నవీన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సమాజంలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్నిపెంపొందించడం,మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయడం, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని విస్తరించడం లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ ఎన్నికల్లో శాఖ అధ్యక్షుడిగా బయగాని రామ్మోహన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సుభాన్, కోశాధికారిగా జనార్ధనాచారిని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు .గౌరవాధ్యక్షులుగా ఎర్ర అనంతరావు, ఊరుకొండ శ్రీనివాస్, కాలు నాయక్, రాచకొండ రామచంద్రయ్యలను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా జి.మంగు, తేజావత్ రవీంద్ర నాయక్, అనుముల సుధాకర్, దూకుంట్ల వెంకన్నలను, కార్యదర్శులుగా బి. స్వప్న, గుడిసే వెంకన్న, కె. వెంకటేశ్వర్లు లను ఎన్నుకున్నారు. వివిధ విభాగాల కన్వీనర్లుగా చెకుముకి విభాగానికి పానుగోతు లాలాచంద్, ఆడిట్ విభాగానికి ఆర్. యాకయ్య, సమత విభాగానికి జీజుల రాజకుమారి, సాంస్కృతిక విభాగానికి డి. మల్లన్న, విద్యా విభాగానికి బి. వీరస్వామి, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి షేక్ మన్సూర్ అలీ, ఆరోగ్య విభాగానికి రామ రాజేశ్వరరావు, పర్యావరణవిభాగానికి భూక్య వీరన్న, సోషల్ మీడియా విభాగానికి షేక్ అక్తర్ పాషా, సోషల్ జస్టిస్ విభాగానికి శ్రీశైలంలను ఎంపిక చేశారు

# గత పాలకులు నల్లమట్టిని అక్రమంగా తరలించారు!

## కందూరు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంపై ఆరోపణలు సరికాదు

### ఆలయ అభివృద్ధి, అవినీతి ఆరోపణలపై చర్చకు సిద్ధం:మాజీ ఎంపీపీ కృష్ణయ్య



అడ్డాకుల, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్):గత పాలకులు అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని చెరువుల నుంచి నల్లమట్టిని అక్రమంగా తరలించారని మాజీ ఎంపీపీ కృష్ణయ్య ఆరోపించారు. మంగళవారం అడ్డాకుల మండల కేంద్రంలోని విజయ మోహన్ రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలకులు కరివేన ప్రాజెక్టు పేరుతో పలు గ్రామాల్లోని చెరువుల నుంచి నల్లమట్టిని తరలించారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాయల్టీ చెల్లించిన తర్వాతే మట్టిని తరలించాల్సి ఉంటుందని కృష్ణయ్య పేర్కొన్నారు. చెరువుల్లో అధికంగా నల్లమట్టిని తొలగించడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని, రైతులకు నష్టం జరిగిందని ఆరోపించారు. కందూరు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని కృష్ణయ్య తెలిపారు. ఆలయంలో అవినీతికి పాల్పడిన అధికారులపై ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని అన్నారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.40 లక్షలు, ప్రాంగణ అభివృద్ధికి మరో రూ.40 లక్షలు, ఆలయంలో రూ.37 లక్షలు, అన్నదాన కార్యక్రమానికి కేటాయించిన రూ.7 లక్షలు ఉన్నాయని ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధంగా ఉన్నామని కృష్ణయ్య పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులపై బహిరంగంగా చర్చిద్దామని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట శ్రీహరి, విజయ మోహన్ రెడ్డి, దశరథ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల నరసింహులు, జగన్న, షఫీ, శేఖర్ రెడ్డి, వేగనాథ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బిజెపి ఓటు చోరీకి పాల్పడుతోంది

## - రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం - ఏఐసీసీ అబ్జర్వర్ కేబిఆర్ నాయుడు - ఓటు పరిరక్షణకు కాంగ్రెస్ ర్యాలీ



ములుగు అక్టోబర్ 27(ప్రజాదర్బార్): రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించే లక్ష్యంతో ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ అబ్జర్వర్ కేబీఆర్ నాయుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, టీపీసీసీ కోఆర్డినేటర్ అరికెల నర్సారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేబీఆర్ నాయుడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ భారత ప్రధానమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజల్లో ఓటు హక్కుపై చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టభద్రులను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలను వివరించాలని, అభ్యర్థి విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని సూచించారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ బలోపేతం, ఎన్నికల కార్యాచరణ, పట్టభద్రుల ఓటర్లను చైతన్యపరచడం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం 'ఓటు బచావో--దేశ్ బచావో' నినాదంతో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, అన్ని మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్నబ్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలి:కలెక్టర్

ములుగు,అక్టోబర్ 27(ప్రజాదర్బార్): అర్నబ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో గూగుల్ మీట్‌లో సమీక్షించారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం అక్టోబర్ 28 ఉదయం 8.30 నుంచి 29 ఉదయం 8.30 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు, గంటకు 50-60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, 30వ తేదీ వరకు అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. మూడు రోజుల పాటు అధికారులు మండలాల్లోనే అందుబాటులో ఉంటూ రాత్రి వేళల్లో స్పందించేందుకు సీనియర్ అధికారిని నియమించాలని, రైతులను అప్రమత్తం చేసి పంట రక్షణ సూచనలు ఇవ్వాలన్నారు. గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పీహెచ్సీల్లో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని, ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏటూరునాగారం చేరుకుందని తెలిపారు.



# ఉచిత కంటి శిబిరంను సద్వినియోగం చేసుకోవాలి

దోమకొండ అక్టోబర్ 27 (ప్రజా దర్బార్)కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని డిప్యూటీ డిఎం హెచ్ ఓ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఉచిత కంటి శిబిరం ను ఆసుపత్రి పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆప్తాల్మిక్ ఆఫీసర్ రవీందర్ పటేల్ అన్నారు. ఈ సందర్భంగా ఆప్తల్మిక్ ఆఫీసర్ మాట్లాడుతూ: సర్వేంద్రియా నామ్ నయనం ప్రధానం అన్నట్లు అన్ని ఇంద్రియాలలో కెల్లా మనకు నేత్రాలు (కండ్లు ) చాలా ప్రధాన మైనవి. అందుకని ప్రతి ఒక్కరు తమ నేత్రాల ( కంటి ) పట్ల చాలా జాగ్రత్త తీసుకోవాలని ఆప్తాల్మిక్ ఆఫీసర్ సూచించారు. కంటి జాగ్రత్తతో పాటు ప్రతి ఒక్కరూ తప్పకుండా పౌష్టికా హారం తీసుకోవడం సమయానికి నిద్రపోవడం మంచి అలవాటు అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మసక చీకటిలో చదవద్దని సెల్ ఫోను ఎంత తక్కువగా వాడితే అంత మంచిది అన్నారు. కంటికి ఏ మాత్రం ఇబ్బంది కలిగిన వెంటనే అందుబాటులో ఉన్న నేత్ర వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్ఫోన్ వాడకం తగ్గించా లని సూచించారు. చిన్న పిల్లలు సెల్ఫోన్ వాడడం వల్ల తొందరగా కంటి జబ్బులు వచ్చే సూచన ఉందని తెలిపారు. ప్రతి వారం నిర్వహించే శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఆటో రిఫ్రాక్టో మీటర్ ద్వారా కంటి దృష్టి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలు ఉన్న వారిని గుర్తించి అవసర మైన వారికి దృష్టి లోపాలను బట్టి కళ్లద్దాలని సూచించ నున్నట్లు తెలిపారు. పిల్లలకు పెద్దలకు కండ్ల కలకలు వచ్చినప్పుడు ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా అందుబాటులో నున్న డాక్టర్ ను సంప్రదించి సూచించిన వైద్య సలహాలు తప్పకుండా పాటించాలని అన్నారు.

# ప్రధాని మోడీ పై అణిచిత వాక్యాలు చేస్తే సహించం:బీజేపీ

వికారాబాద్ జిల్లాప్రతినిధి, అక్టోబర్27(ప్రజాదర్బార్) దేశ ప్రధాని నరేంద్ర మోదీ పై అనుచిత వాక్యాలు చేస్తే సహించేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మోడీపై బురద గమనిస్తున్నారని పేర్కొన్నారు. మోదీని, ఆయన తండ్రిని జైలులో వేస్తామంటూ ఖర్గే చేసిన వ్యాఖ్యలకు నిరసనగానే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని పలువురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, సీనియర్ నాయకుడు పాండు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు వివేకానంద రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కేశవులు, నవీన్ కుమార్, మల్లేష్ పటేల్, నరోత్తం రెడ్డి, హరికృష్ణ, యువమోర్చా నాయకుడు చిట్యాల సాయిచరణ్ రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్లను వేగవంతం చేయాలి

## జిల్లాలో 33,601 ఆధార్ బయోమెట్రిక్ నవీకరణలు పెండింగ్

### ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రక్రియ పూర్తి చేయాలి: డీఆర్ఓ ఎ. నిర్మల



మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): జిల్లాలో 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 33,601 ఆధార్ బయోమెట్రిక్ నవీకరణలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) ఎ. నిర్మల అధికారులను ఆదేశించారు. మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆమె ఆధార్ సేవల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ నవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 25 పాఠశాల ఆధార్ కిట్లను పూర్తిస్థాయిలో వినియోగించి పెండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. విద్య, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ లేని పిల్లలను గుర్తించి పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉన్న ఆధార్ కిట్ల ద్వారా నమోదు చేయించాలని తెలిపారు. పాఠశాలల వారీగా పెండింగ్ వివరాలను సేకరించి, అత్యధికంగా నవీకరణలు పెండింగ్‌లో ఉన్న విద్యాసంస్థల్లో ముందుగా శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ పూర్తి చేయించాలని, ఆధార్ సీడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జనన ధ్రువీకరణ పత్రాల జారీకి అవసరమైన బీఆర్ఎన్ నంబర్లను సకాలంలో జనరేట్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, చెంచు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఉచితంగా లభించే ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ సేవలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారి ఆధార్ నమోదు దరఖాస్తులు, ఇతర పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, మహిళా శిశు సంక్షేమ అధికారి జరీనా బేగం, ఎస్సీ సంక్షేమ అభివృద్ధి అధికారి సునీత, బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి విష్ణునందన్, ఎస్టీ సంక్షేమ అభివృద్ధి అధికారి ఛత్రు నాయక్, యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఈడీఎం చంద్రశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికను మాయమాటలతో తీసుకెళ్లిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు-రూ.30 వేల జరిమానా

### జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

మెదక్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27 :(ప్రజాదర్బార్ ) బాలికను మాయమాటలతో నమ్మించి వెంట తీసుకెళ్లిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 30 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. 8వ తరగతి చదువుతున్న బాలికను ఆమె తండ్రి 14-10-2025న హాస్టల్‌కు వెళ్లేందుకు బస్సు ఎక్కించారు. అయితే, వడియారం వద్ద బస్సు ఆగకపోవడంతో బాలిక చేగుంటలో దిగింది. ఈ క్రమంలో తనకు పరిచయమున్న ఆనంద్ (22) అనే యువకుడికి ఫోన్ చేసి, తాను చేగుంటలో ఉన్నానని, తనను హాస్టల్ వద్ద దింపాలని కోరింది. అక్కడికి చేరుకున్న ఆనంద్ మాయమాటలు చెప్పి, తనతో ఉంటే బాగా చూసుకుంటానని నమ్మించి బాలికను వెంట తీసుకెళ్లాడు.మొదట మేడ్చల్‌కు తీసుకెళ్లి అక్కడ కొంతసేపు ఉన్న అనంతరం నిజామాబాద్‌కు వెళ్లారు. మరునటి రోజు ఉదయం సికింద్రాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి ఆనంద్ తన పిన్ని ఇంటికి బాలికను తీసుకెళ్లాడు. అయితే, బాలికను ఇంటికి వెళ్లాలని ఆనంద్ తల్లి సూచించడంతో అక్టోబర్ 15, 2025 రాత్రి 8 గంటల సమయంలో బస్‌స్టాండ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో తూప్రాన్ పోలీసు సిబ్బంది బాలికను గుర్తించి భరోసా కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో తొలుత మిస్సింగ్ కేసు నమోదైంది. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న తూప్రాన్ పోలీసులు బాలికను గుర్తించి, దర్యాప్తును పకడ్బందీగా పూర్తి చేశారు. కేసు దర్యాప్తు అధికారి ఎస్ఐ ఎన్. జ్యోతి సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య కోర్టులో బలమైన వాదనలు వినిపించగా, లీగల్ అడ్వైజర్ శ్వేత బాలిక సాక్ష్యం చెప్పేందుకు అవసరమైన సహకారం అందించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవల్లి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 30 వేల జరిమానా విధించారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ నాగరాజు సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారిపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## పోక్సో చట్టంపై విద్యార్థులకు విస్తృత అవగాహన

### జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమాలు




మహబూబ్‌నగర్, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): బాలల హక్కుల పరిరక్షణ, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నివారణపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని న్యాయాధికారులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు పాఠశాలల్లో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమాలను నిర్వహించారు. పోక్సో చట్టం--2012పై పాన్ ఇండియా పాఠశాల అవగాహన కార్యక్రమం మొదటి దశలో భాగంగా విద్యార్థులకు బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, లైంగిక నేరాల నివారణ, చట్టపరమైన రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మహబూబ్‌నగర్‌లోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వి. ఈశ్వరయ్య, పాఠశాల ప్రిన్సిపల్ జి. అనిరుధ్ నటరాజ్ గౌడ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నయీమ్, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు గ్రేస్, లీగల్ ఎయిడ్ ప్యానెల్ న్యాయవాది తగిలి కృష్ణ పాల్గొన్నారు. టీడీ గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చీఫ్ ఎల్ఏడీసీఎస్ రవీందర్ నాయక్, డిప్యూటీ చీఫ్ యోగేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు మణిరామ్ రాథోడ్ పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అపెక్స్ సెంట్రల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ పర్వేజ్, ఎల్ఏడీసీఎస్ అసిస్టెంట్ మల్లారెడ్డి పాల్గొన్నారు. అలాగే బాలానగర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నవాబుపేట కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమంలో మొబైల్ కోర్టు న్యాయమూర్తి మునవర్, మహబూబ్‌నగర్ గెలాక్సీ హైస్కూల్‌లో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రవిశంకర్, జడ్చర్ల అక్షర హైస్కూల్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముదసిర్ పాల్గొన్నారు. వివిధ కార్యక్రమాల్లో న్యాయాధికారి డి. ఇందిర, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ బాలలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పిల్లలు తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను గుర్తించి, భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని వివరించారు. బాలలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం, వారి హక్కులను కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు రూపొందించిన పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో చట్టపరమైన హక్కులు, బాలల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

### డిఆర్‌ఓ ఎ.నిర్మలవిద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్లు త్వరితగతిన పూర్తి చేయాలి: డిఆర్‌ఓ ఎ.నిర్మల



జిల్లాలో 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 33,601 ఆధార్ బయోమెట్రిక్ నవీకరణలను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ఐదేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదు, సీడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఓ) ఎ. నిర్మల అధికారులను ఆదేశించారు. విద్య, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ (యూఎంసీ) సమావేశంలో ఆమె జిల్లాలో ఆధార్ సేవల పురోగతిని సమీక్షించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ నవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న 25 పాఠశాల ఆధార్ కిట్లను వినియోగించి పెండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ లేని చిన్నారులను గుర్తించి, పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉన్న ఆధార్ కిట్ల ద్వారా కొత్తగా నమోదు చేయించాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదును ప్రాధాన్యంగా తీసుకోవాలని, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల సహకారంతో అర్హులైన పిల్లలందరికీ ఆధార్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా పెండింగ్ వివరాలను సేకరించి, అత్యధికంగా నవీకరణలు పెండింగ్‌లో ఉన్న విద్యాసంస్థల్లో ప్రాధాన్యత క్రమంలో శిబిరాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల వివరాలను సంబంధిత పోర్టల్లలో సక్రమంగా నమోదు చేయడంతో పాటు, ఆధార్ సీడింగ్ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఐదేళ్లు నిండిన పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ పూర్తి చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సేవలు పొందడంలో ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చని తెలిపారు. పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల జారీకి అవసరమైన బిఆర్ఎన్ (BRN) నంబర్లను ఎప్పటికప్పుడు జనరేట్ చేసేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, చెంచు ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించి అర్హులందరికీ సేవలు అందించాలన్నారు. ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ సేవలను నిర్ణీత నిబంధనల ప్రకారం ఉచితంగా పొందే అవకాశంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆధార్ వివరాల్లో ఇతర మార్పులు అవసరం లేని విద్యార్థుల బయోమెట్రిక్ నవీకరణకు సంబంధించిన విధివిధానాలను స్పష్టంగా వివరించి ప్రక్రియను సులభతరం చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి సంబంధించిన ఆధార్ నమోదు దరఖాస్తులు, ఇతర పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జరీనా బేగం, జిల్లా ఎస్.సి సంక్షేమ అభివృద్ధి అధికారి సునీత, జిల్లా బి .సి సంక్షేమ అభివృద్ధి అధికారి విష్ణునందన్, జిల్లా ఎస్ .టి సంక్షేమ అభివృద్ధి అధికారి ఛత్రు నాయక్, యూ.ఐ.డి.ఏ.ఐ అసిస్టెంట్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఈ.డి. ఎం చంద్రశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గునీటి ఇబ్బందులు తొలగించేందుకు సర్పంచ్ చొరవ



మాడుగులపల్లి(ప్రజా దర్బార్)అక్టోబర్ 27:మాడుగులపల్లి నుంచి తోపుచర్ల గ్రామం వరకు విస్తరించి ఉన్న వర్షకాలువకు గ్రామ సర్పంచ్ నన్నెబోయిన పార్వతమ్మ రమేష్ యాదవ్ ప్రత్యేక చొరవతో మరమ్మతు పనులు చేపట్టారు. గత కొంతకాలంగా కాలువ నిర్వహణ లోపించడంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించిన సర్పంచ్, కాలువలో అడ్డంకులను తొలగించి సాగునీటి సరఫరా మెరుగుపడేలా మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే సాగునీటి సరఫరా సజావుగా సాగి, పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.గ్రామ అభివృద్ధితో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి సర్పంచ్ చూపుతున్న చొరవను గ్రామస్తులు, పలువురు నాయకులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట గుండ్రెడ్డి రమణారెడ్డి, గుండ్రెడ్డి నారాయణరెడ్డి, నరేందర్ రెడ్డి, నన్నెబోయిన అంజయ్య, రాచూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

బూర్గంపహాడ్ ప్రజాదర్బార్, అక్టోబర్ 27:మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ చందన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించి ప్రశ్నలు అడిగి సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల టైంటేబుల్, ఉపాధ్యాయుల డైరీలు, కంప్యూటర్ ల్యాబ్ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు నిరంతరం సరైన శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# స్టాంప్ పేపర్లపై అధిక వసూళ్లు!.. ఫ్రాంకింగ్ సేవలకూ రసీదులు లేవు....

### మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని వినతి...

మెట్‌పల్లి, అక్టోబర్ 27: (ప్రజా దర్బార్) స్టాంప్ పేపర్ల విక్రయాల్లో అధిక వసూళ్లు చేస్తున్నారని, ఫ్రాంకింగ్ సేవలకు సైతం సరైన రసీదులు ఇవ్వడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో మెట్ పల్లి పట్టణంలో స్టాంప్ వెండర్లు అధిక వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపిస్తున్న ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరపాలని కోరుతున్నారు. మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో స్టాంప్ పేపర్ల కొనుగోలు చేసే ప్రజల నుంచి నిర్ణీత ధర కంటే అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఫ్రాంకింగ్ సేవలు పొందే వారి నుంచి కూడా అధిక డబ్బులు తీసుకుంటున్నప్పటికీ, అందుకు సంబంధించిన రసీదులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ పనుల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలు స్టాంప్ పేపర్లు, ఇతర అవసరాల కోసం అదనపు డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సేవలకు సంబంధించిన చార్జీల వివరాలు స్పష్టంగా తెలియజేయడంతోపాటు, వసూలు చేసిన ప్రతి మొత్తానికి రసీదు అందించాలని కోరుతున్నారు. ప్రజలకు అందించాల్సిన సేవల్లో పారదర్శకత ఉండాలని, స్టాంప్ పేపర్ల విక్రయాలు, ఫ్రాంకింగ్ సేవలకు సంబంధించిన చార్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. అధిక వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనుమతించిన ధరల ప్రకారమే స్టాంప్ పేపర్లు విక్రయిస్తున్నారా? ప్రతి లావాదేవీకి రసీదులు అందిస్తున్నారా? అనే అంశాలను పరిశీలించాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని స్టాంప్ విక్రయాలు, ఫ్రాంకింగ్ సేవలపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

యాదాద్రి(బీబీనగర్) అక్టోబర్ 17 ప్రజాదర్బార్ : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని, యువత ప్రశ్నించే హక్కును కోల్పోవద్దని, ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ బీబీనగర్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 31 అక్టోబర్ 2023 నాటికీ డిగ్రీ దానికి డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఓటరు నమోదుకు అర్హులని చెప్పారు. దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 6 చివరి తేదీ అని, జిల్లాలోని ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరుతో ఓటర్ నమోదు చేయించి, దిగ్విజయం చేయాలని, పార్టీ నాయకులు విద్యార్థి యువజన విభాగం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఓటర్ నమోదుకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డ్, డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, మెమో, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నెంబర్ కావాలని చెప్పారు.

## పొరపాట్లకు తావులేకుండా జనగణన నిర్వహించాలి

# జనగణనలో 40 రకాల ప్రశ్నలతో వివరాల సేకరణ

### -2027 జనవరి 10 నుంచి రెండో దశ జనగణన ప్రారంభం-

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణనపై జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, ఛార్జ్ ఆఫీసర్లు (తహసీల్దార్లు), అదనపు ఛార్జ్ ఆఫీసర్లు (ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు)కు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2027 జనవరి 10 నుంచి ఫిబ్రవరి 28 వరకు రెండో దశ జనగణన ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్), జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి జనగణన నిర్వహించనున్నట్లు వివరించారు. ఫిబ్రవరి 28 రాత్రి ఇళ్లు లేని వారిని గణిస్తారని, మార్చి 1 నుంచి 5 వరకు రివిజన్ రౌండ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జనగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి 40 రకాల ప్రశ్నల ద్వారా కుటుంబ వివరాలను సేకరిస్తారని తెలిపారు. ప్రజలు సరైన సమాచారాన్ని అందించి జనగణన



విజయవంతానికి సహకరించాలని కోరారు. గ్రామపంచాయతీల వారీగా స్వీయ గణనపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా జనగణన పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ మొదటి దశ హౌస్ లిస్టింగ్ సర్వేను విజయవంతంగా నిర్వహించినట్లే రెండో దశ జనగణనను కూడా సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మాట్లాడుతూ జనగణన వివరాలను డిజిటల్ విధానంలో మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఛార్జ్ అధికారులు, సిబ్బంది జనగణన విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, స్వీయ గణనపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జడ్పీ సీఈవో వెంకటరెడ్డి, ఆర్డీవో నవీన్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, సీపీవో నర్సింహులు, హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు దయానంద్, శివరామకృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎల్నినో ప్రభావంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

యాదాద్రి(తుర్కపల్లి) అక్టోబర్ 27(ప్రజాదర్బార్) ఎల్నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాతం తగ్గుదల, ఎండ తీవ్రత, తాగునీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఎల్.గీతారెడ్డి, కొండాపురం గ్రామ సర్పంచ్ శివరాత్రి లావణ్య జహంగీర్ సూచించారు. మంగళవారం తుర్కపల్లి మండలం కొండాపురం గ్రామంలో ఎల్నినో ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూగర్భ జలాలను పెంపొందించేందుకు గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. గ్రామంలో నీటి సంరక్షణ చర్యలను ప్రజల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గొనె జహంగీర్, వార్డు సభ్యులు తుటి సుమలత, మహేష్, తుటి రవికిరణ్, లింగాల సత్యం, బండారి స్వప్న, కుమార్, గోధుమకుంట మధు, కొండ పద్మ, కొండ పాండు, వాటర్ ఏఈ, ఫీల్డ్ అసిస్టెంట్, వ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక శాఖల అధికారులు, జీపీఓ, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా ప్రజా రవాణా విభాగాన్ని పరిశీలించిన

# ఏపీ ఎస్ ఆర్ టి సి కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ప్రజాదర్బార్ /కర్నూలు) ఏపీఎస్ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ ఆర్ కె కిషోర్ మంగళవారం కర్నూలు జిల్లా ప్రజా రవాణా విభాగాన్ని తనిఖీ చేశారు. ముందుగా బస్ స్టాండ్ ను తనిఖీ చేసి బస్టాండ్ లో నిర్ణీత ధరల కన్నా ఎక్కువ ధరలకు వస్తువులు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండులో మూత్రశాలలను పరిశీలించి పరిశుభ్రతపై మరింత శ్రద్ధ వహించాలని అన్నారు. బస్టాండ్ లోకి అనధికారికంగా వస్తున్న వాహనాలు ఆటోలు మోటార్ సైకిల్ ల వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న కారణంగా వాటిని సెక్యూరిటీ సిబ్బంది చేత కచ్చితంగా నియంత్రించాలని ఆదేశించారు. అనంతరం కొత్తగా నిర్మిస్తున్న ఆర్టీసీ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆ తర్వాత కర్నూలు-2 డిపో లో ఎలక్ట్రానిక్ బస్సుల కొరకు కొత్తగా నిర్మిస్తున్న ఇ- బస్సు స్టేషన్ ను పరిశీలించారు. కర్నూలు-1 డిపో ట్రాఫిక్ గ్యారేజీ ఆఫీసు విభాగాలను తనిఖీ చేశారు కర్నూలు-1 డిపోలో కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. వందన పొదుపు ఆవశ్యకతను షెడ్యూల్ 34లలో తీసుకోవలసిన మెలకువలను వివరించారు. డ్రైవర్లకు కండిషన్ లో ఉన్న బస్సులు అందించాలని మెకానికులకు ఉద్బోధించారు. తద్వారా మార్గమధ్యంలో యాంత్రిక లోపంతో బస్సులు ఆగిపోకుండా సమయపాలనతో సర్వీసు కొనసాగించేలా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు సురక్షిత ప్రయాణం అందజేయడం ద్వారా ప్రజల ఆదరణ



లభిస్తుందని అది సంస్థ భవిష్యత్తుకు ఎంతో తోడ్పడగలదనిర్దేశం చేశారు. అనంతరం కార్గో సెక్షన్ ను తనిఖీ చేశారు. కార్గోలో రోజువారి ఆదాయం గురించి అసిస్టెంట్ మేనేజర్ కమర్షియల్ శ్రీమతి దీప్తి సుజలను అడిగి తెలుసుకు న్నారు. కార్గో ఆదాయం తెలుపునకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంట కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ శ్రీమతి రోజా రమణి, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ సురేంద్రబాబు, కర్నూలు ఒకటి డిపో మేనేజర్ నాగభూపాల్, పర్సనల్ అధికారి రామకృష్ణ, కర్నూలు -1 మరియు కర్నూలు -2 డిపోల ట్రాఫిక్ అండ్ మెకానికల్ సూపర్వైజర్లు, బస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాటేపల్లి రవీందర్ ఏకగ్రీవ ఎన్నిక

మాడుగులపల్లి (ప్రజా దర్బార్)అక్టోబర్ 26:- తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికల్లో నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం కన్నెకల్ గ్రామానికి చెందిన కాటేపల్లి రవీందర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సాదుల శ్రీకాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాటేపల్లి రవీందర్, రాష్ట్ర కార్యదర్శిగా సత్తు వెంకన్న, గౌరవ అధ్యక్షుడిగా వెంకటేష్ ఇంద్రవల్లిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వెంకటేష్ ఇంద్రవల్లి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సుమారు 50 వేల మంది ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అసోసియేషన్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కాటేపల్లి రవీందర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు

# రైల్వే రిజర్వేషన్ కౌంటర్లలోనూ ప్రయాణ బీమా సౌకర్యం

## - అక్టోబర్ 27 నుంచి కొత్త విధానం అమలు- కేవలం 45 పైసల ప్రీమియంతో ఐచ్ఛిక ప్రయాణ బీమా- బీమా కోరుకునే ప్రయాణికులు డిజిటల్ పద్ధతిలోనే చెల్లింపులు చేయాలి

న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. ఇప్పటివరకు ఐఆర్‌సీటీసీ ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు మాత్రమే అందుబాటులో ఉన్న ఐచ్ఛిక ప్రయాణ బీమా సౌకర్యాన్ని రైల్వే రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు కూడా విస్తరించింది. ఈ సదుపాయం అక్టోబర్ 27 నుంచి అమల్లోకి వచ్చినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 89 శాతం రైల్వే రిజర్వేషన్ టికెట్లు ఐఆర్‌సీటీసీ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ అవుతుండగా, మిగిలిన టికెట్లు రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా బుక్ అవుతున్నాయి. ఇప్పటివరకు కౌంటర్లలో టికెట్లు తీసుకునే ప్రయాణికులకు బీమా సదుపాయం లేకపోవడంతో, ప్రయాణికులందరికీ ప్రయోజనం చేకూర్చేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.

45 పైసలతో ప్రయాణ బీమా

రైల్వే రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్లు బుక్ చేసుకునే సమయంలో ప్రయాణికులు బీమా కావాలా, వద్దా అనే విషయాన్ని తప్పనిసరిగా తెలియజేయాలి. బీమాను ఎంచుకునే ప్రయాణికులు టికెట్ ఛార్జీని డిజిటల్ విధానంలోనే చెల్లించాల్సి ఉంటుంది. నగదు చెల్లింపులను అంగీకరించరు. ప్రతి ప్రయాణికుడికి కేవలం 45 పైసల బీమా ప్రీమియం వసూలు చేస్తారు. బీమా తీసుకునే ప్రయాణికులు తప్పనిసరిగా మొబైల్ నంబర్ అందించాలి. సంబంధిత బీమా సంస్థ పాలసీ వివరాలను నేరుగా మొబైల్ నంబర్‌కు పంపిస్తుంది. రైలు ప్రమాదాలతో పాటు అవాంఛనీయ ఘటనలకూ బీమా రక్షణ ఈ బీమా రైలు బయలుదేరినప్పటి నుంచి గమ్యస్థానానికి చేరుకునే వరకు వర్తిస్తుంది. రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జరిగే ప్రమాదాలతో పాటు రైలు ప్రమాదాలు, ఉగ్రవాద చర్యలు, హింసాత్మక దోపిడీలు, ప్రమాదవశాత్తు నడుస్తున్న రైలు నుంచి కిందపడటం వంటి ఘటనలకు కూడా పాలసీ నిబంధనల ప్రకారం బీమా రక్షణ లభిస్తుంది. ఒక పీఎన్ఆర్‌లోని ప్రయాణికులకు బీమా ఎంపిక చేస్తే, ఆ పీఎన్ఆర్‌లో ఉన్న ప్రయాణికులందరికీ వర్తిస్తుందని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఈ బీమా సౌకర్యం సంబంధిత బీమా కంపెనీల నిబంధనలు, షరతులకు లోబడి ఉంటుందని తెలిపింది. ప్రయాణికులు ఈ ఐచ్ఛిక బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.




# వెంటనే సీసీ రోడ్ల పనులు ప్రారంభించాలి

## అధికారులతో ఫోన్లో ఆదేశించిన మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్- వెంటనే పనులు చేపట్టాలని కాలనీ బాసుల సమక్షంలో అధికారులతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే



(ప్రజాదర్బార్ /ఉప్పల్) హైదరాబాదులోని రామంతపూర్ వెంకట సాయి నగర్ కాలనీలో మంజూరు అయినాగాని షి రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఉప్పల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ లతో కాలనీవాసుల సమక్షంలో ఫోన్ ద్వారా మాట్లాడి పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా చూడాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులు పనులను పర్యవేక్షిస్తూ నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలో రోడ్ల అభివృద్ధి పనులు ప్రజల అవసరాలకు అనుగుణంగా త్వరిత గతిన పూర్తి కావాలని ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. కాలనీవాసుల సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి సిసి రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని సూచించడంపై వెంకట సాయి నగర్ కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి, గౌరవ టీం సభ్యులు కాలనీ ప్రజలు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి, బిజెపి మేడ్చల్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి వల్లపు జగన్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి, గౌరవ సభ్యులు రమేష్ గౌడ్, గోపాల్ యాదవ్, సర్వ సత్తయ్య యాదవ్,,శివశంకర్, సంజీవ, బీరప్ప, కమిటీ సభ్యులు ఆర్ .గోవింద్ జి అశోక్ ,సి హెచ్ శ్రీనివాస్ గౌడ్, విద్యాసాగర్, శివకుమార్ రామకృష్ణ చలపతిరావు,శెట్టి రమేష్, శేఖర్, హరీ, సిద్దు గౌడ్, చిటికల శ్రీనివాస్, పెద్ద నరసింహ ,మహేష్ గౌడ్, నరసింహ, గణేష్, భానుచందర్ ,శ్రీశైలం, వెంకటేష్ చారి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూమి కబ్జా,పట్టించుకోని అధికారులు

బషీరాబాద్ అక్టోబర్ 27 (ప్రజా దర్బార్) వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం పరిధిలో మైల్వార్ గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 235లో అక్రమంగా వెల్డింగ్,పంచార్ షాప్ ను నిర్మించడం జరిగిందని, మంగళవారం నాడు మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ కుర్వ తమన్న,వార్డు సభ్యులు బలరాం,నరేష్, ప్రవీణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అబ్దుల్ ఖలీల్ సత్తార్,ఇబ్రహీం మీడియా సమావేశంలో మాట్లాడుతూ దానం లక్ష్మప్ప ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణానికి వత్తాసు పలుకుతూ కొందరి నాయకులతో కుమ్మక్కై మొహమ్మద్ అబ్దుల్ గౌస్ ఇంటి నెంబర్ 2-61/5 లో వెల్డింగ్ షాపు 2024 మే నెలలో ఉన్నట్లు షాప్ కోసం విద్యుత్ మీ టర్ క్యాటగిరి 2లో అనుమతి తీసుకొని విద్యుత్ మీటర్ను అమర్చుకున్నారు. అనుమతి తీసుకున్న స్థానంలో విద్యుత్ మీటర్ అమర్చకుండా మైల్వార్ బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ స్థలములో వెల్డింగ్ షాప్ లో అమర్చారు. ఈ షాపుకు ఎలాంటి ప్రభుత్వం అనుమతులు లేవు,కానీ నీటి వసతి కల్పించాలని గ్రామపంచాయతీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు.ప్రభుత్వ అధికారి పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఒకచోట మరొకచోట నీటి వసతి కలెక్షన్ ఏ విధంగా ఇవ్వాలని తిరస్కరించడం జరిగింది.విద్యుత్తు మీటర్, నల్ల కలెక్షన్, గ్రామపంచాయతీ అనుమతి,పన్ను రసీదులను జతపరిచి ప్రభుత్వ స్థలాన్ని కాజేయాలని ఉద్దేశంతో ఇలా చేస్తున్నారని అన్నారు.గతంలో ఇలాగే ఇంటి నిర్మాణం చేపట్టారని ప్రభుత్వ అధికారుల నుండి నోటీసులు జారీ చేసిన లెక్కచేయకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నారని,సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి,ప్రభుత్వ భూమిని,ఆస్తులను కాపాడాలని, గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వ స్థలాన్ని ఉపయోగించాలని కోరడం జరిగింది.

### అర్నబ్ తుపాను ప్రభావం..

# రైలు ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

**- భారీ వర్షాల నేపథ్యంలో రైళ్ల రద్దు, దారి మళ్లింపునకు అవకాశం- ప్రయాణానికి ముందు రైళ్ల స్థితిని తెలుసుకోవాలి: దక్షిణ మధ్య రైల్వే- ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు.. 139 ద్వారా సమాచారం**

హైదరాబాద్, అక్టోబర్ 27 (ప్రజా దర్బార్): అర్నబ్ తుపాను తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రైలు ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో తుపాను ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రయాణికుల భద్రత దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేయడం, దారి మళ్లించడం లేదా సమయాల్లో మార్పులు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అర్నబ్ తుపాను అక్టోబర్ 28 ఉదయం అతి తీవ్రమైన తుపానుగా ఆంధ్రప్రదేశ్ తీరంలోని బాపట్ల, విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం అక్టోబర్ 28న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 28, 29 తేదీల్లో వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.

భద్రతా చర్యలపై రైల్వే ఉన్నతాధికారుల సమీక్ష తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్‌తో పాటు సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రైల్వే మార్గాల్లో ప్రమాదకర ప్రాంతాలు, వంతెనలు, చెరువుల నీటిమట్టాలు, గస్తీ ఏర్పాట్లపై సమీక్షించారు. కాజీపేట, డోర్నకల్ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు బండరాళ్లు, ఇసుక సంచులు, కంకరతో పాటు ప్రమాద సహాయక రైళ్లు, వైద్య సహాయక పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఆపరేటింగ్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, కమర్షియల్, మెడికల్ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైల్వే వంతెనలు, ప్రమాదకర ప్రాంతాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రయాణానికి ముందు రైలు స్థితిని తెలుసుకోవాలి భారీ వర్షాలు, తుపాను పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు, సమయాల్లో మార్పులకు సంబంధించిన సమాచారాన్ని రిజర్వేషన్ సమయంలో నమోదు చేసిన మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ, రైల్ వన్, ఎన్‌టీఈఎస్ యాప్‌ల ద్వారా రైళ్ల తాజా స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా రైల్వే హెల్ప్‌లైన్ 139 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని సూచించారు. రైళ్ల రద్దు, పాక్షిక రద్దు, దారి మళ్లింపు వివరాలను దక్షిణ మధ్య రైల్వే అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తామని వెల్లడించారు. ప్రయాణికులు తుపాను సమయంలో అనవసర ప్రయాణాలను నివారించాలని, అత్యవసర ప్రయాణాల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు.

### ప్రజా కవి సుద్దాల హనుమంతు

# విగ్రహాన్ని ట్యాంక్ బండి పై పెట్టాలి

కుత్బుల్లాపూర్. అక్టోబర్ 27. ప్రజాదర్బార్. 20 26 సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ పురస్కారాల వేడుకలను ఘనంగా నిర్వహించారు ప్రజాకవి సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ పురస్కారాల సభ రవీంద్రభారతిలో సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ గేయ రచయిత రాష్ట్రపతి అవార్డు గ్రహీత అశోక తేజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ అవార్డు ను సన్మానం అందుకున్న మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ ఐలయ్య దంపతులు రోడ మేస్త్రి నగర్ డివిజన్ మగ్గం నగర్ నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓబిసి రాష్ట్రీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ నాడు నైజాం నిరంకుశత్వ పాలనకు వ్యతిరేకంగా మట్టి మనుషులకు పాటలే తూటాలై సాయిధ ఉద్యమానికి తిరుగుబాటు నేర్పిన వీరుడు ప్రజా కవి సుద్దాల హనుమంతు అన్నారు నాడు నైజాం పాలన పోయి ప్రజల ప్రజా పాలన రావాలని హనుమంతు పిలుపునిచ్చారు నేడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి నేటి దొరల పాలను తరిమికొట్టి తెలంగాణలో ప్రజా పాలన ఏర్పాటు చేశారు ఈ ప్రజా పాలనలో మన సంస్కృతి కాపాడుట కోసం కవులను కళాకారులను జానపద కళాకారులను ప్రోత్సహిస్తూ మన తెలంగాణ సంస్కృతి కాపాడుతున్నారని అన్నారు ఈ ప్రజా పాలనలో నాటి కలలుగన్న ప్రజా కవి సుద్దాల హనుమంతు విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలని వారి పేరు మీద తెలంగాణ జానపద అకాడమీని సుద్దాల హనుమంతు పేరు మీద ఏర్పాటు చేయాలని కోరారు ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ




అద్దంకి దయాకర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు సుద్దాల హనుమంతు స్ఫూర్తితో సుద్దాల తెలంగాన సాయిధ పోరాట యోధులు గూడ పుల్లయ్య గౌడ్ రామస్వామి బత్తిని లక్ష్మీ నరసింహారెడ్డి వారసత్వంగా 40 సంవత్సరాలు ఎర్రజెండా నీడలో నిరుపేదల కోసం రైతుల కోసం విద్యార్థుల కోసం యువకుల కోసం కార్మికుల కోసం నిరంతరం పోరాడి జైలుకెళ్లి జీవన కొనసాగించిన నాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా పేదలకు ఎక్కువ సేవ చేయాలంటే కాంగ్రెస్ లో కలిసి పని చేయాలని అవకాశం కల్పించారు నాకు ఈ అవార్డు అవకాశం కల్పించిన సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ అశోక్ తేజ సుధాకర్ తేజ కి ధన్యవాదాలు తెలియజేశారు సందర్భంగా జాతీయ దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బూదాల అమర్ బాబు సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ సినీ గే రచయిత సుద్దాల అశోక్ తేజను గజమాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వరమ్మ ఆనంద్ బాబు రేవంత్ రెడ్డి యువసేన గూడ సాయి ప్రవీణ్ గౌడ్. అడ్వకేట్ రోహిత్ గౌడ్ సాయి పూజ గౌడ్. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ గౌడ్. జెకె కృష్ణ ప్రగతి శ్రీనివాస్ ప్రవీణ సందీప్ ప్రసన్న భరత్ మాజీ సైనికుడు గడ్డమీద కళావతి యాదమ్మ బాస్ పెల్లి బాలకృష్ణ బత్తిని ఐలయ్య నరసమ్మ సులోచన మంగ పాల్గొన్నారు.

## కొడకండ్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

కొడకండ్ల,(ప్రజాదర్బార్ )అక్టోబర్ 27: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కొడకండ్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, హైదరాబాద్‌కు చెందిన ఒమేగా హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్ విజయవంతమైంది. లయన్స్ క్లబ్ అంతర్జాతీయ "సేవా నినాదమైన మేము సర్వ స్ఫూర్తితో, సంతోషకరమైన ముఖాలు, హృదయపూర్వక ఈ సేవ" కార్యక్రమంలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కొడకండ్ల మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘ భవనంలో మంగళవారం నిర్వహించిన ఈ శిబిరానికి గుండె సంబంధిత సమస్యలు, అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 100 మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. ఒమేగా హాస్పిటల్‌కు చెందిన వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, త సర్పంచ్ శ్రీమతి దూలం మమత మరియు టీ. వెంకటరెడ్డి, రీజియన్ చైర్మన్ శ్రీమతి నాగవాణి, జోన్ చైర్మన్ డాక్టర్ రామనర్సయ్య, దామెర సరేష్, లయన్ రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసునూరి మధుసూదన్ పాల్గొని మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుత కాలంలో బీపీ, గుండె సంబంధిత వ్యాధులు, గుండెపోటు